కార్పొరేషన్‌లో పనిదొంగలు

- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు
- చీపురు పట్టరు.. చెత్త ఎత్తరు
- వేలల్లో మాత్రం వేతనాలు తీసుకుంటారు
- ప్రభుత్వం మారినా నేటికీ కొనసాగుతున్నారు
- కొందరు కార్పొరేటర్ల ఆదేశాలతో ఆర్డరు లేకుండానే అటెండర్లుగా పనులు
- ఏరివేత దిశగా చర్యలేవీ?

ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో ఐదేళ్లుగా వైసీపీ నేతలు స్వైరవిహారం చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆప్కాస్ పేరుతో ఇష్టారాజ్యంగా తమ పార్టీ కార్యకర్తలకు ఉద్యోగాలు ఇప్పించారు. పేరుకు శానిటరీ వర్కర్‌గా నమోదు చేసి, వైసీపీ కోసం వారి సేవలను వినియోగించుకున్నారు. ఎలాంటి ఆర్డర్లు లేకుండానే తమకు అనుకూలమైన వారిని అటెండర్లు, మేస్త్రీలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ వర్కర్లుగా నియమించారు. గత ఐదేళ్లలో వందల సంఖ్యలో పోస్టులను యథేచ్ఛగా ఇచ్చేయడంతోపాటు, వేతనంగా ప్రభుత్వ సొమ్మును భారీగా చెల్లించారు. దీంతో కార్పొరేషన్ ఖజానాకు భారీగానే గండిపడింది. కాగా ప్రభుత్వం మారినా వారిలో ఎటువంటి మార్పు లేదు. పైగా కార్యాలయం ఎప్పటికీ తమ అడ్డానే అన్న విధంగా ప్రవర్తించడం కొసమెరుపు.

150 మందికి పైగా ఉద్యోగాలు.. రూ.వేలల్లో జీతాలు

బాలినేని శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన అనుచరులు, అలాగే పార్టీ కార్యకర్తల కోసం ఇష్టారాజ్యంగా ఉద్యోగాలకు సిఫారసు చేశారు. ఆప్కాస్ కింద 56 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. శానిటరీ విభాగం, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వీరికి నెలనెలా రూ.21వేల వేతనం చెల్లిస్తున్నారు. మరోవైపు కొవిడ్ సిబ్బంది కింద మరో 100 మందికిపైగా ఉద్యోగాలు ఇవ్వగా వీరికి నెలకు రూ.18వేలు చెల్లిస్తున్నారు. అయితే వీరిలో ఇరవై, ముప్పై మంది మాత్రం ఉద్యోగాలకు వెళుతుండగా, మిగిలిన వారు కార్పొరేటర్ల సేవలో కొనసాగుతున్నారు. ఒక్కో కార్పొరేటర్ వద్ద కనీసం ముగ్గురు, నలుగురు సేవలు అందిస్తుండగా, వారికి ఆప్కాస్ కింద, కార్పొరేషన్ నిధుల నుంచి ఠంచన్‌గా జీతాలు చెల్లిస్తున్నారు. అయితే నిన్న, మొన్నటి వరకూ అధికారంలో వైసీపీ ఉండగా, అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించారు.



త్వరలో ప్రక్షాళన చేస్తాం



పనిచేయని కార్మికుల తొలగింపునకు చర్యలు చేపట్టాం. ఎక్కడా లేనివిధంగా ఒంగోలులోనే మేస్త్రీల వ్యవస్థ ఎక్కువగా ఉంది. పేరుకు 140 మంది మేస్త్రీలు ఉన్నారు. కానీ వాస్తవంగా విధుల్లో కనిపించేవారు అతి తక్కువ మంది. అటువంటి వారిని గుర్తించాం. పనిచేయని వారిని ఉపేక్షించేది లేదు. అలాగే కార్యాలయంలోనూ ఆర్డరు కాపీ లేకుండా అటెండర్లుగా ఉన్నవారిని గుర్తించి, గతంలో వారు కొనసాగిన పనిలోకి పంపుతాం. ఇకపై శానిటరీ సెక్రటరీలు కూడా కచ్చితంగా తెల్లవారుజామున విధుల్లో ఉండాల్సిందే. ఇప్పటికే సెక్రటరీలకు హెచ్చరికలు జారీ చేశాం. నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు వేగవంతం చేశాం. అందుకు అనుగుణంగా త్వరలోనే ప్రక్షాళన చేసి, సమస్యలన్నీ పరిష్కరిస్తాం.

- ఎం. జశ్వంత్‌రావు,
ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 22 : అధికారం మాదే. అడిగేవారు లేరంటూ ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ నేతలు రెచ్చిపోయారు. ఇష్టారాజ్యంగా తమ వారికి పోస్టులు పంచుకున్నారు. అధికారులను, సిబ్బందిని సైతం బెదిరించి మరీ పనులు చేయించుకున్నారు. అధికారులు కూడా చేసేదేమీ లేక వైసీపీ నేతల ఆదేశాలకు జీహుజూర్ అనడంతోపాటు పనిలోపనిగా తమ జేబులు నింపుకొన్నారు. అటు వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలించగా, ఒంగోలు పాలకవర్గం ఏర్పాటు అయి మూడేళ్లు దాటింది. దీంతో పాలన వైసీపీ కార్పొరేటర్ల చేతిలోకి వెళ్లిపోగా.. ఇష్టమైన వారికి కాంట్రాక్టు పోస్టులు కట్టబెట్టడం, తమ ఇళ్లలోనూ, పెద్ద నేతల పనులకు వినియోగించుకున్నారు. విధుల్లోకి రావాలని మున్సిపల్ అధికారులు అడిగితే అన్నకు చెప్పండి అని అనడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం మారినా ఇప్పటికీ అదే తంతు నడుస్తోంది.

పాలన మారినా మారని తీరు..

తాజాగా జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి గుణపాఠం చెప్పారు. తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారు. ప్రభుత్వం మారింది.. పాలకులు మారారు.. కానీ కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్ల పెత్తనం మాత్రం అలాగే కొనసాగుతోంది. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆపార్టీ కార్యకర్తలకు ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు ఇవ్వగా నేటికీ వారు కార్పొరేటర్లకు అనుచరులుగానే తిరుగుతున్నారు. పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారు. పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో కొందరు వైసీపీ కార్యకర్తలకు పోస్టులు ఇవ్వగా, నేటికీ ఒక్కరోజు కూడా వారు కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. అయితే అధికారులు సైతం వారికి పనిచెప్పడానికి వెనుకాడటం వెనుక ఆంతర్యం ఏమిటనే అనుమానాలు అందరిలోనూ వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా కొందరు అధికారులు తమ వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. పారిశుధ్య కార్మికులుగా చేరి కార్పొరేషన్‌లో పెత్తనం చేస్తున్న వారందరితో చీపుర్లు పట్టించి నగరంలో ఊడ్పిస్తే అసలు బండారం బయటపడటం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇంకా వైసీపీ కార్పొరేటర్ల కనుసన్నల్లోనే పనిచేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

ముగ్గురు ఉద్యోగులు.. వారికి ముగ్గురు అటెండర్లు

ప్రభుత్వం మారినా వైసీపీ కార్పొరేటర్లు మాత్రం వెనక్కు తగ్గడం లేదు. తమ మనుషులతో పనిచేయించడానికి వీల్లేదంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. సుమారు 19 మంది పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ పనులకు పోకుండా కార్పొరేషన్ కార్యాలయంలో తిరుగుతుండడంపై అటు అధికారులు, ఇటు ఇతర సిబ్బంది పెదవి విరుస్తున్నారు. గతంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేసిన వారు తమ పలుకుబడి, కార్పొరేటర్ల ఆశీస్సులతో కార్యాలయంలో అటెండర్లుగా కొనసాగుతున్నారు. అయితే అధికారపూర్వకంగా వీరికి ఎలాంటి ఆర్డరు కాపీ లేకపోయినా, ఆయా సెక్షన్‌లలో హల్‌చల్ చేయడంపై ఇతర రెగ్యులర్ ఉద్యోగులు మండిపడుతున్నారు. ముఖ్యంగా అకౌంట్ సెక్షన్‌లో ముగ్గురు ఉద్యోగులు పనిచేస్తుండగా వారికి ఒక్కొక్కరికి ఒక్కో అటెండర్ ఉండటం చూస్తుంటే వైసీపీ కార్పొరేటర్ల పెత్తనం ఏస్థాయిలో ఉందో అర్థమవుతుంది. పేరుకు పారిశుధ్య కార్మికులుగా విధుల్లోకి చేరిన వారు చీపురు పట్టడానికి ఇష్టపడరు. పనిచేయడానికి ముందుకు రారు అనే మాట అధికారుల వైపు నుంచి వినిపిస్తోంది. ఇంకోవైపు నగరంలో పారిశుధ్య సమస్య వేధిస్తుండగా, అందుకు అనుగుణంగా కార్మికులు లేరు. వైసీపీ అండదండలతో పలు సెక్షన్‌లలో పెత్తనం చేస్తున్న 19మంది కార్మికులను తిరిగి చెత్త సేకరణకు పంపాల్సి ఉంది. అలాగే ఆప్కాస్ కింద ఉద్యోగాలు పొంది, కార్యాలయానికి రాని వారిని తొలగించాల్సిన అవసరం ఉందని అధికారులే చెబుతున్నారు. ప్రజలకు మెరుగైన, పారదర్శక పాలన కోసం అధికారులు కృషిచేయాలని, ఐదేళ్లుగా పనిచేయకుండా ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకున్న వారి నుంచి రికవరీలు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా

అల్లూరి జిల్లాకు దినేష్‌కుమార్ బదిలీ


తమీమ్ అన్సారియా

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎ.తమీమ్ అన్సారియా నియమితులయ్యారు. ఆమేరకు శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్సారియాకు కలెక్టర్‌గా ఇదే తొలి పోస్టింగ్. గతంలో ఆమె కొన్ని మునిసిపాలిటీల్లో కమిషనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన తమీమ్ అన్సారియా కేరళ రాష్ట్రానికి చెందిన వారని తెలిసింది. ఆమె భర్త కూడా ఐఏఎస్ అధికారి. ఇద్దరూ ఏపీ పరిధిలోనే ఉన్నారు. ప్రస్తుతం ఆమె భర్త శ్రీకాకుళం కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన్ను బదిలీ చేయలేదని తెలిసింది. ఎన్నికలకు కొద్దికాలం ముందుగానే అన్సారియా శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం అన్సారియాను మన జిల్లాకు 38వ కలెక్టర్‌గా నియమించారు. నిబంధనలకు అనుగుణంగా పనిచేసుకు వెళ్లే అధికారిగా ఆమెకు పేరుంది. మితభాషి అని కూడా చెప్తున్నారు. ఇప్పటివరకూ ఇక్కడ కలెక్టర్‌గా ఉన్న దినేష్‌కుమార్‌ను గిరిజన ప్రాంతాలతో ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. తమిళనాడుకు చెందిన దినేష్‌కుమార్‌కు కూడా కలెక్టర్‌గా మన జిల్లాలోనే తొలి పోస్టింగ్ ఇవ్వగా రెండేళ్లు పనిచేశారు. అధికారపార్టీ నేతలతో సమన్వయంగా పనిచేయడంలో సఫలీకృతులయ్యారు. ఒకదశలో ఆయనకు మళ్లీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇవ్వకపోవచ్చని భావించారు. కానీ వివిధ కోణాల్లో పరిశీలించిన అనంతరం ఆయన్ను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా నియమించినట్లు తెలిసింది.


బస్సుల్లో తనిఖీలు చేస్తున్న ఆర్టీఏ అధికారులు

బడి బస్సుల తనిఖీ

- కొరడా ఝుళిపించిన రవాణా శాఖ
- ఎనిమిది వాహనాలపై కేసులు నమోదు

ఒంగోలు(క్రైం), జూన్ 22: రవాణా శాఖ ఎట్టకేలకు కదిలింది. బడి బస్సులపై కొరడా ఝుళిపించింది. పాఠశాలలు ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ 50శాతం బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్ష చేయించడంపై రవాణా శాఖ అధికారులు కన్నెర్ర చేశారు. శనివారం ఉదయం స్థానిక మంగమూరురోడ్డు జంక్షన్‌తోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ లేకుండా ఉన్న బస్సులతోపాటు లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా 74 బస్సులను తనిఖీలు చేశారు. 12 బస్సులపై కేసులు నమోదు చేశారు. వాటిలో ఒంగోలులో ఎనిమిది, ఇతర ప్రాంతాలలో నాలుగు ఉన్నాయి. మొత్తం రూ.1,03,600 జరిమానా విధించారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపైకి వస్తే కేసులు నమోదుచేస్తామని ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారులు హెచ్చరించారు. తనిఖీలలో మార్కాపురం ఆర్టీవో అమరనాయక్, ఎంవీఐలు ఎ.మాధవరావు, ఎ.కిరణ్ ప్రభాకర్, కె.రామచంద్రరావు, ఎల్.సురేంద్రప్రసాద్, రవినాయక్, కె.జయప్రకాష్ పాల్గొన్నారు.

నిరంతరం తనిఖీలు చేస్తాం : సుశీల, డీటీసీ

స్కూల్ బస్సులను నిరంతరం తనిఖీ చేస్తామని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 21 బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. సుమారు రూ.2.5లక్షలకుపైగా జరిమానా విధించామని చెప్పారు. పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకోవాలని ఆదేశించారు.





విజయోత్సవ ర్యాలీకి హాజరైన ప్రజలు (ఇన్‌సెట్‌లో)అభివాదం చేస్తున్న దామచర్ల, మాగుంట, రియాజ్

అంతా జనార్దనమే!

- వెల్లువెత్తిన అభిమానం.. ఉరకలెత్తిన ఉత్సాహం..!
- ఎమ్మెల్యే దామచర్లకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల ఘనస్వాగతం
- ఒంగోలులో భారీ ర్యాలీ
- అడుగడుగునా గజమాలలు
- కనులపండువలా విజయోత్సవ ర్యాలీ

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 22: తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఒంగోలుకు విచ్చేసిన దామచర్ల జనార్దన్‌కు అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు అపూర్వస్వాగతం పలికారు. రెండు రోజులపాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఆయన శనివారం సాయంత్రం నియోజకవర్గానికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. స్థానిక కర్నూలు రోడ్ నుంచి బీకే ఎన్‌క్లేవ్ వరకు విజయోత్సవ ర్యాలీ అంగరంగ వైభవంగా సాగింది. కొత్తపట్నం మండలం, ఒంగోలు రూరల్ మండలం, నగరంలోని అన్ని డివిజన్‌ల నుంచి మధ్యాహ్నం నుంచే టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, దామచర్ల అభిమానులు, నాయకులు పెద్దసంఖ్యలో పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. దామచర్ల కాన్వాయ్‌కి త్రోవగుంట వద్ద నుంచే అభిమానులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే జనార్దన్ వాహనం వెంట భారీగా కార్ల ర్యాలీ కొనసాగింది. ఇంకోవైపు మరో ఐదు వందలకుపైగా బైక్‌లతో కర్నూలు రోడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి మొదలైన విజయోత్సవ ర్యాలీ ఆర్టీసీ బస్టాండ్, అద్దంకి బస్టాండ్, పాత మార్కెట్ సెంటర్, మస్తాన్ దర్గా, ట్రంక్‌రోడ్డు, చర్చి సెంటర్, నెల్లూరు బస్టాండ్ మీదుగా ఆయన నివాసం ఉండే బీకే ఎన్‌క్లేవ్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా దామచర్ల స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి, అద్దంకి బస్టాండ్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌ల వద్ద ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దామచర్ల జనార్దన్ వాహనంపై కూర్చుని నగర ప్రజలకు, అభిమానులకు, పార్టీశ్రేణులకు నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

వెల్లువెత్తిన అభిమానం

ఒంగోలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దామచర్ల జనార్దన్ 34,026 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించిన నేపథ్యంలో పార్టీశ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు తీరారు. మరోవైపు భారీ పూలమాలలు వేసేందుకు క్రేన్‌లు ఏర్పాటు చేశారు. అడుగడుగునా పూల జల్లు కురిపిస్తూ, దామచర్లకు జేజేలు పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. భారీగా బాణసంచా కాల్చి పండుగ చేశారు. మరోవైపు మహిళలు హారతులిచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కొంతమంది మహిళలు, కార్యకర్తలు పసుపు దుస్తులు ధరించి, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దామచర్ల విజయోత్సవ ర్యాలీని పురస్కరించుకుని శుభాకాంక్షలు, అభినందనలతో ఫ్లెక్సీలు ఏర్పాటుచేయడంతోపాటు తోరణాలు కట్టడంతో నగరమంతా పసుపుమయంగా మారింది. అంతకుముందు తెలుగు తమ్ముళ్లు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించి సందడి చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వాహనంపై దామచర్లతోపాటు ఎంపీ మాగుంట, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ ఉన్నారు.

బిల్లుల కోసం పైరవీలు

- బీజేపీ నేత ద్వారా వైసీపీ నాయకుడి ప్రయత్నాలు
- అర్ధంతరంగా ఆగిన రైతు బజారు పనులు


దర్శిలో పనులు నిలిచిపోయిన రైతు బజార్


నిర్మాణం పూర్తికాక ముందే నెర్రెలిచ్చిన పునాదులు

దర్శి జూన్ 22 : దర్శి - కురిచేడులో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న రైతుబజార్ వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో మధ్యలో నిలిచిపోయింది. కూరగాయలు పండించే రైతులు మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా ఏడాది క్రితం రైతు బజార్ నిర్మాణం చేపట్టారు. మార్కెటింగ్ శాఖ రూ.80 లక్షలు మంజూరు చేయగా రూ.60 లక్షల పనులకు టెండర్లు పిలిచారు. ఓ వైసీపీ నాయకుడు నిర్మాణ పనులు చేపట్టాడు. ఆయన నాసిరకం మెటీరియల్‌తో పనులు చేస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. ఏదోరకంగా చేతులు దులుపుకోవాలన్న ఉద్దేశంతో కొంతమేర పనులు చేసి మొదటి బిల్లు రూ.25 లక్షలకు అధికారులు పంపించారు. వైసీపీ ప్రభుత్వం నిధుల కొరతతో బిల్లులు విడుదల చేయలేదు. అనంతర ఎన్నికల కోడ్ రావడంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. షాపులకు గోడలు నిర్మించారే కాని కొన్నింటికి శ్లాబులు కూడా వేయలేదు, పునాదులకు అరకొరగా మట్టి తోలడంతో నెర్రెలు ఇచ్చాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ వైసీపీ నాయకుడి నోట్లో వెలక్కాయ పడినట్లయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆ నాయకుడు భూఆక్రమణలకు కొంతమందిని పురమాయించడంతోపాటు అడ్డగోలు పంచాయితీలు చేసి అనేక అక్రమాలకు పాల్పడ్డాడు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో బిల్లుల కోసం ప్రత్యామ్నాయదారులు వెతుకుతున్నట్లు తెలిసింది.

బీజేపీ నాయకుడి ద్వారా ప్రయత్నాలు

రైతుబజార్ బిల్లుల విడుదల కోసం సదరు వైసీపీ నాయకుడు ఓ బీజేపీ నాయకుని ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. టీడీపీ నియోజకవర్గ నాయకులను ఓ బీజేపీ నేత కలిసి ఆపనులకు తాను పెట్టుబడి పెట్టానని, బిల్లులు విడుదల చేయించాలని కోరినట్లు తెలిసింది. అందుకు ఆ టీడీపీ నాయకులు సమ్మతించకుండా ఆలోచించి నిర్ణయం తీసుకుందామని చెప్పినట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక శాఖల్లో తూతూమంత్రంగా పనులు చేశారు. చాలామందికి ఎన్నికల కోడ్‌తో బిల్లులు రాలేదు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి బిల్లులను నిలిపివేయాలని నిర్ణయించటంతో మరికొంత మంది వైసీపీ నాయకులు కూడా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. గతంలో ఉన్న పరిచయాలను దృష్టిలో ఉంచుకొని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి వద్దకు వెళ్తున్నట్లు సమాచారం. అయితే, ఆయన నియోజకవర్గ టీడీపీ నాయలకులతో సంప్రదించకుండా ఎలాంటి పనులూ చేయడం లేదు. దీంతో వైసీపీ నాయకులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

రేపు 'మీకోసం' కార్యక్రమం

ఒంగోలు (కల్చరల్), జూన్ 22 : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీకోసం (ప్రజా ఫిర్యాదుల దినం) కార్యక్రమం ఈ నెల 24న ఉదయం 10గంటల నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే దామచర్లకు బ్రహ్మరథం



ఎమ్మెల్యే జనార్దన్‌కు గజమాలతో సత్కరిస్తున్న జయంత్‌బాబు, నాయకులు

మద్దిపాడు, జూన్ 22: ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌కు శనివారం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో గజమాలతో దామచర్లను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, కొమ్మాలపాటి సుబ్బారావు, దేవబత్తిన ప్రసాద్, కాకర్ల విజయ్‌కుమార్, ముత్తనపల్లి రామలింగయ్య, మండవ గోపి, తుమ్మల సుధాకర్‌రావు, పోకూరి శ్రీనివాసరావు, అద్దేపల్లి లక్ష్మీదుర్గాభవానీ, అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బుర్రాకు మాతృవియోగం



లక్ష్మమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి పార్థసారథి, పక్కన మధుసూదన్

శివపురం (టంగుటూరు), జూన్ 22 : కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ తల్లి బుర్రా లక్ష్మమ్మ (82) వయాభారంతో మృతిచెందారు. మండలంలోని శివపురంలో ఉన్న స్వగృహంలో శుక్రవారం సాయంత్రం ఆమె కన్నుమూశారు. లక్ష్మమ్మకు ముగ్గురు కుమారులుండగా వారిలో పెద్దకొడుకు ప్రసాద్ అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. మధుసూదన్ రెండో కుమారుడు. మూడో కుమారుడు మునుస్వామి వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. శనివారం లక్ష్మమ్మ అంత్యక్రియలు జరిగాయి. మధుసూదన్ వియ్యంకుడైన రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శివపురం చేరుకొని లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మల్లవరప్పాడు గ్రామ సర్పంచ్ రాచగర్ల వెంకట్రావు, బీసీ నాయకుడు బొట్లా రామారావు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జాలిరెడ్డి, చుండూరి రంగారావు, ఎంపీటీసీ సభ్యుడు బుర్రా అంకరాజు తదితరులు ఉన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికిషోర్

ఒంగోలు(కల్చరల్), జూన్ 22: రాష్ట్రంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.కోటేశ్వరరావు, జి.రవికిషోర్ డిమాండ్ చేశారు. నెల్లూరు డివిజన్ కమిటీ సమావేశం శనివారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రవికిషోర్ మాట్లాడుతూ కేరళలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఏజెంట్లకు పెన్షన్ సౌకర్యం, వారి పిల్లలకు స్కాలర్‌షిప్ వసతి కల్పిస్తున్నారన్నారు. అలాగే మన రాష్ట్రంలో కూడా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, 65 సంవత్సరాల పరిమితి ఎత్తి వేయాలని ఆయన చెప్పారు. గ్రాట్యుటీపై ఉన్న సీలింగ్ ఎత్తివేసి, గ్రాట్యుటీ లెక్కింపు విధానాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్, నెల్లూరు డివిజన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బెజవాడ శివయ్య, సీహెచ్.నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకట్రావు, నాయకులు ధనుంజయ, కె.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, కె.బాలచంద్రం, కె.రామకోటిరెడ్డి, సీహెచ్‌వీ.సుబ్బారెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించిన కూటమి నాయకులు



మొక్కులు తీర్చుకున్న జనసేన నాయకులు

మద్దిపాడు, జూన్ 22: జనసేన పార్టీ నాయకులు శనివారం లింగంగుంటలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో మొక్కులు చెల్లించారు. కాకర్లమూడి హరిత ఆధ్వర్యంలో దేవాలయంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంతనూతలపాడు ఎమ్మెల్యేగా బీఎన్.విజయ్‌కుమార్ విజయం సాధించినందుకు మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎం.వెంకటేశ్వర్లు, ఏడుగుండ్ల సత్యనారాయణ, కవల బుజ్జి, శేషయ్య, అద్దేపల్లి భవాని, తిరుమలశెట్టి చిరంజీవి, శివశంకరవరప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘడియపూడి కాలనీలో..

మద్దిపాడులోని ఘడియపూడి కాలనీలోని శనివారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పోలేరమ్మ గుడి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రభను ఏర్పాటుచేసి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పాటకచ్చేరిని ఏర్పాటు చేసి విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, దేవబత్తిన ప్రసాద్, మాజీ సర్పంచ్ అన్నమనేని సుబ్బారావు, చింతల శ్రీనివాసరావు, కవల వెంకటేశ్వర్లు, బొమ్మల శ్రీనివాసరావు, కనగా శ్రీనివాసరావు, కోడిరెక్కల సుబ్బారావు, ఆబోతు నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ప్రభపై మాట్లాడుతున్న జయంత్‌బాబు

అభివృద్ధికి నోచని గుండ్లకమ్మ కాలువలు !

ప్రాజెక్ట్‌ను నిర్వీర్యం చేసిన వైసీపీ పాలకులు ● చిల్లచెట్లు, పూడికతో నిండిన కాలువలు ● ఆయకట్టు రైతులకు నీరందని దుస్థితి



చిల్లచెట్లతో మూసుకుపోయిన గుండ్లకమ్మ ఎడమ కాలువ

నాగులుప్పలపాడు, జూన్ 22: తాగు, సాగు నీటి వరప్రదాయని అయిన గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌ను గత వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారు. ప్రాజెక్ట్ కాలువలు చిల్లచెట్లు, జమ్ము, పూడికతో నిండిపోయి చుక్క నీరు ముందుకు కదలని దుస్థితి నెలకొంది. దాంతో ప్రాజెక్ట్ పరిధిలోని ఆయకట్టు రైతులకు వ్యవసాయానికి సాగునీరు, గ్రామాలకు తాగునీరు సైతం అందక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మద్దిపాడు మండలం మల్లవరం వద్దనున్న కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ జలాశయం పరిధిలోని ఎడమ ప్రధాన కాలువ 22 కిలోమీటర్లు ఉంది. దీని పరిధిలో సుమారు 20 గ్రామాల రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం హయాంలో గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌కు చెందిన రెండు గేట్లు వరదకు కొట్టుకుపోయి గత ఏడాది పంటలకు నీరు అందక ఎండిపోయి రైతు కంట కన్నీరు మిగిల్చింది. అప్పటి నుంచి ప్రాజెక్ట్ గేట్లు మరమ్మతులు చేపట్టడంలో మీన మేషాలు లెక్కిస్తూ నాటి ప్రభుత్వం విఫలమయిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ కాలువల సమస్యలపై పలు ప్రజాసంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టి ప్రభుత్వం దృషికి తీసుకెళ్లిన చీమకుట్టినట్లుగా కూడా వ్యవహరించకపోవడాన్ని రైతులు తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్ట్ ఎడమ కాలువలో చిల్లచెట్లు, జమ్ము నిండిపోయి నీరు ముందుకు కదిలే పరిస్థితి లేకుండా ఉంది. దీంతో ఈ ఏడాది కూడా సాగుకు నీరు అందుతుందో లేదోనని ఆందోళనలో రైతులు ఉన్నారు. ఇప్పటికే గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించిన నూతన తెలుగుదేశం ప్రభుత్వం గేట్ల మరమ్మతు పనులు ప్రారంభించింది. ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించి గేట్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రధాన కాలువలను అభివృద్ధి చేపట్టడంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, చివరి భూములు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందించాలి



వ్యవసాయ సీజన్ మొదలైనందున ఎడమ కాలువలో పెరిగిన చిల్లచెట్లను తొలగించాలి. కాలువను అభివృద్ధి చేయాలి. ప్రభుత్వం దృష్టి సారించి చివరి భూముల వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

\- పాలపర్తి బాలకోటి, ఒమ్మెవరం సర్పంచ్

ప్రభుత్వం దృష్టి సారించాలి



గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లు కొట్టుకుపోయి గత ఏడాది సక్రమంగా నీరు అందక రైతులు నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి ప్రాజెక్ట్ గేట్లతో పాటు కాలువల పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలి. ఈ ఏడాది వ్యవసాయానికి సాగునీరు సక్రమంగా అందించాలి.

\- కొమ్మాలపాటి సురేష్, రైతు, ఒమ్మెవరం

నేత్రపర్వంగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

గరుడ వాహనంపై విహరించిన స్వామివారు ● వేలాదిగా తరలివచ్చిన భక్తులు ● హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు పూజలు



గరుడవాహనంపై విహరిస్తున్న స్వామివారు



ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న న్యాయమూర్తి మన్మథరావు

సింగరాయకొండ, జూన్ 22 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శనివారం దేవస్థానంలోని మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు రాజ్యలక్ష్మి, గోదాదేవి, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజామున గరుడవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పార్వేట ఉత్సవంలో భాగంగా సోమరాజుపల్లి గ్రామానికి మోతకాపులు మోసుకెళ్లారు. అక్కడి గ్రామస్థులు పందిర్లు వేసి స్వామి వారికి స్వాగతం పలికారు. పాతసింగరాయకొండ పురవీధుల్లో గరుడ వాహనంపై స్వామివారు విహరించారు. గరుడసేవ ముగిసిన తర్వాత చప్పర సేవపై గ్రామోత్సవం నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిమందిగా భక్తులు తరలివచ్చి లక్ష్మీనరసింహుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో పి.కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాలక్ష్మీనరసింహాచార్యులు, అర్చకుడు నరసింహాచార్యులు, యాజ్ఞికం సుదర్శనాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న రామచంద్రయ్యయాదవ్

హైకోర్టు న్యాయమూర్తి పూజలు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కుంభజడల మన్మథరావు శనివారం వరాహ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయనవెంట జూనియర్ సివిల్ జడ్జి మద్దసాని శ్రీను, సీనియర్ న్యాయవాది సన్నెబోయిన శ్రీనివాసులు ఉన్నారు. కాగా శుక్రవారం రాత్రి బీసీ వై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయ్య యాదవ్ స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

నేడు కల్యాణం, రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహస్వామికి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. అనంతరం భక్తులకు శ్రీకృష్ణయాదవ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ ఉంటుంది. సాయంత్రం రథోత్సవం జరుగుతుంది.

టంగుటూరు ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తా !

● పౌరసన్మానంలో మంత్రి స్వామి



సభలో మంత్రి స్వామిని సత్కరిస్తున్న నాయకులు

టంగుటూరు, జూన్ 22 : టంగుటూరు ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన స్వామితోపాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యకు టంగుటూరులో శనివారం రాత్రి పౌరసన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ తనను మూడోసారి గెలిపించిన కొండపి నియోజకవర్గ ప్రజలకు జీవితకాలం రుణపడి ఉంటానన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన పారదోలి ప్రజాపాలన తెచ్చారని, ఇది ప్రజల విజయమన్నారు. ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటామన్నారు. అమరావతిని పునర్నిస్తామని, పోలవరాన్ని పూర్తి చేస్తామన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీవారి ఒత్తిళ్లతో విచ్చలవిడిగా పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. తనపై 11, జనార్దన్‌పై 23 కేసులు ఉన్నాయని గుర్తు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనంతో కక్ష సాధింపు చర్యలకు పుల్‌స్టాప్ పడిందన్నారు. ఈసారి అధికారంలోకి రాగానే రూ.4వేలకు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చామని, వచ్చే నెల ఒకటో తేదీనే రూ.4వేలతోపాటు పెండింగ్‌లో ఉన్న మూడు నెలలు కలిపి రూ.7 వేలు ఇస్తున్నామన్నారు. పింఛన్‌ల పథకాన్ని ఎన్టీఆర్ భరోసాగా మర్చామని, ఈ అవకాశం తన శాఖద్వారా కలగడం ఆనందంగా ఉందన్నారు. టంగుటూరుకు రామతీర్థం నీరు అందిస్తామని, పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో ఇళ్ల పట్టాల సమస్య పరిష్కరిస్తామని, కొత్తగా ఇళ్లులేని పేదలకు మూడు సెంట్లు నివేశన స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ అహంకార ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపారన్నారు. ఒంగోలులో జరిగిన మహానాడు ద్వారానే ఓ సంచలన విజయం సాధించామని, ఇప్పుడు అఖండ విజయం సాధించామన్నారు. అందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వామి, సత్యలను ప్రజలు ఘనంగా సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ మద్దిరాల మమత, సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, అడకా స్వాములు, జనసేన నేత బాలకోటయ్య, రాంబాబు పాల్గొన్నారు.

తర్లుపాడు పీహెచ్‌సీకి వైద్యుల డుమ్మా

పది రోజులుగా కన్నెత్తి చూడని వైనం

రోగుల ఇబ్బందులు

తర్లుపాడు, జూన్ 22: తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది రోజుల నుంచి వివిధ సాకులతో వైద్యులు ఆరోగ్య కేంద్రానికి రాకపోవటంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. ఇద్దరూ కూడా విధులకు సక్రమంగా రాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకరు కచ్చితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉండి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా.. మరొకరు 108 వాహనంలో వివిధ గ్రామాలకు వెళ్లి వైద్య పరీక్షలకు నిర్వహించాలి. కానీ తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఇద్దరు వైద్యులు విధులకు హాజరుకావటం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు వైద్యులు లేరని తెలుసుకొని ఇంటిదారి పడుతున్నారు. కొందరు రోగులు విధిలేని పరిస్థితుల్లో మార్కాపురం ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లి వేలకు వేలు వెచ్చించి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వైద్యులే సక్రమంగా రాకపోతుండటంతో సిబ్బంది కూడా ఇష్టానుసారంగా వస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు ఏఎన్ఎంలు వైద్య పరీక్షలు నిర్వహించి ట్యాబ్లెట్లు ఇచ్చి పంపిస్తున్నారు. గతంలో తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాహుల్, డాక్టర్ వంశీ ఉన్న సమయంలో సుమారు రోజుకు 150 ఓపీలు వచ్చేవి. ప్రస్తుతం 20 నుంచి 30 ఓపీలు మాత్రమే వస్తున్నాయి. ప్రస్తుతం ఇరువురు అనుభవం లేని డాక్టర్లు ఉండటంతో రోగులు సరైన వైద్యం అందక ఇబ్బందులకు గురవుతున్నారు. గర్భిణులు కూడా కాన్పులు చేయించుకునేందుకు మార్కాపురం వెళ్లాల్సి వస్తుంది. బుధవారం 15 మంది రోగులు బొందలపాడు నుంచి వచ్చి డాక్టర్లు లేకపోవటంతో ఆటోలో తిరిగి వెళ్లారు. ఈ విషయాన్ని మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌వో రాహుల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఒక డాక్టరైనా ఆరోగ్య కేంద్రంలో ఉండాల్సి ఉంది అని, విధులకు హాజరుకాని డాక్టర్లపై విచారణ జరిపి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.



పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుల కుర్చీలు

అవీ..ఇవీ..

మంత్రులను కలిసిన మాగుంట



మంత్రి రవికుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కల్చరల్), జూన్ 22: ఒంగోలు పార్లమెంటుసభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్‌కు బొకే అందజేసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సచివాలయంలో జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను సైతం ఎంపీ మాగుంట కలిసి అభినందనలు తెలిపి శాలువతో సన్మానించారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, దామచర్ల సత్య, దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ ఆయన వెంట ఉన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

మద్దిపాడు, జూన్ 22: మద్దిపాడు మండలం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర శనివారం ఎదురెదురుగా మోటార్‌సైకిళ్లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. గుండ్లాపల్లి గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న వీరాంజనేయులు మోటార్‌సైకిల్‌పై వస్తూ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టాడు. సంఘటనలో వీరాంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డికి గాయాలు అయ్యాయి. దీంతో క్షతగాత్రులను చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

నేడు కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం

మద్దిపాడు, జూన్ 22: నందిపాడులోని శ్రీగంగా పార్వతి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి కళ్యాణోత్సవం ఆదివారం జరుగనుంది. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు రాజుపంతులు ఆధ్వర్యంలో వంకాయలపాటి వీరన్న పంతులు వంశస్థులు కళ్యాణ క్రతువును నిర్వహిస్తారని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి సైతం పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో తెలిపారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

మద్దిపాడు, జూన్ 22: విద్యతోనే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చని ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి పేర్కొన్నారు. శనివారం పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొమ్మాలపాటి శోభారాణి మాణిక్యమ్మ జ్ఞాపకార్థం రూ.20 వేల విలువ చేసే పుస్తకాలను దొడ్డవరప్పాడుకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు కొమ్మాలపాటి శ్రీరామమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హరిత, రజనికుమారి, అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.


పేద విద్యార్థికి చేయూత

ఒంగోలు(కల్చరల్), జూన్ 22: ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థులకు ఎప్పుడూ అండగా ఉంటామని ప్రముఖ పారిశ్రామిక వేత్త, సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని ట్రస్టు కార్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న షేక్ అబ్దుల్లా అనే విద్యార్థికి ఆయన ట్రస్ట్ తరపున పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, సైకిల్ అందజేశారు. సెక్రటరీ షేక్ సర్దార్ బాషా మాట్లాడుతూ ప్రవాస భారతీయుడు శ్రీకాంత్‌చౌదరి, సతీష్ ఆర్థిక సహకారం అందించారని చెప్పారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ చైర్‌పర్సన్ సయ్యద్ షహనాజ్, సుబ్బారావు, జనసేవ నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గజవాహనంపై వేంకటేశ్వరుడు

మద్దిపాడు, జూన్ 22: మద్దిపాడులోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం పురగిరి క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. మేళతాళాల మధ్య అర్చకులు మద్దిపాటి వెంకటరమణ దీక్షితులు, గోపయ్య పంతులు, మారుతిపంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అంజిరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా స్వామివారి కళ్యాణోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

విశ్రాంత ఉపవిద్యాధికారి మృతి



అహరోన్‌రావు(ఫైల్)

ఒంగోలు(విద్య), జూన్ 22: ఒంగోలు ఉప విద్యాధికారిగా ఉద్యోగ విరమణ చేసిన అహరోన్‌రావు(71) శనివారం ఉదయం స్థానిక మామిడిపాలెంలోని స్వగృహంలో మరణించారు. ధేనువకొండకు చెందిన అహరోన్‌రావు ఉద్యోగరీత్యా ఒంగోలులో స్థిరపడ్డారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. జిల్లా పరిషత్‌లో ఉద్యోగిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. తర్వాత వెంగముక్కలపాలెం ఎంపీయూపీ స్కూలు హెచ్ఎంగా పనిచేస్తూ కొత్తపట్నం హైస్కూలు హెచ్ఎంగా ఉద్యోగోన్నతి పొందారు. ఒంగోలు, కొత్తపట్నం, కొండపి మండలాల్లో ఎంఈవోగా పనిచేశారు. అనంతరం ఒంగోలు ఉప విద్యాధికారిగా ఉద్యోగోన్నది పొందారు. డీఈవో కార్యాలయంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించారు. ప్రభుత్వం నుంచి పలు అవార్డులు అందుకున్నారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అహరోన్‌రావు భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టు మృతి

నాగులుప్పలపాడు, జూన్ 22 : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మోటార్‌సైక్లిస్టు దుర్మరణం చెందారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపిన వివరాల మేరకు.. వేటపాలెం మండలం సంతరావూరు గ్రామానికి చెందిన ఎండ్లూరి ఎలీషా(45) శుక్రవారం రాత్రి తన మోటార్‌సైకిల్‌పై ఒంగోలు వెళుతూ నాగులుప్పలపాడు సమీపంలోని కోల్డ్ స్టోరేజ్ వద్దకు రాగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన ఎలీషా తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ బ్రహ్మనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సొసైటీ చైర్మన్ బొట్లా రాజీనామా

టంగుటూరు, జూన్ 22 : జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ పదవికి బొట్లా రామారావు శనివారం రాజీనామా చేశారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి బేబీరాణికి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు.

పిల్లలందరినీ బడిలో చేర్పించాలి



జరుగుమల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

జరుగుమల్లి, జూన్ 22 (కొండపి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం జరుగుమల్లి మండలంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేంద్రవదన్ పాల్గొని మాట్లాడారు. పిల్లలు ఉండాల్సింది పనిలోకాదు.. బడిలో అని చెప్పారు. పాఠశాల మానేసి ఉన్న వారిని గుర్తించి బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, హెచ్ఎం మర్రిబోయిన శ్రీనివాసులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

ఒంగోలు(కల్చరల్), జూన్ 22: విద్యార్థులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పొందాలని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన తన కుమారుడు జ్ఞాపకార్థం 30మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వాన్ని ఇప్పించారు. గ్రంథాలయ కార్యదర్శి ఆదిలక్ష్మి చేతులమీదుగా వీటిని అందజేశారు. విద్యార్థులు వారంలో కనీసం ఒకసారైనా వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, లైబ్రేరియన్ కె.సంపూర్ణమ్మ, మహాత్మాగాంధీ పాఠశాల ఉపాధ్యాయురాలు రేష్మ, సిబ్బంది శివారెడ్డి, ఎ.ప్రసాద్, డి.కోటేశ్వర రావు, పీవీ.సుబ్బారెడ్డి, ఝాన్సీ, సామాజిక సేవకులు నున్నా ఆంజనేయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సభ్యత్వాన్ని అందజేస్తున్న కార్యదర్శి ఆదిలక్ష్మి, పేరయ్య

మంత్రి రవికుమార్‌కు అభినందనలు



మంత్రి రవికుమార్‌కు అభినందనలు తెలుపుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, జూన్ 22: రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌కు దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్, మామయ్య కడియాల వెంకటేశ్వర్లు, కడియాల రమేష్‌లు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ఐదుసార్లు వరుసగా శాసనసభ్యునిగా గెలుపొందిన బాబాయి రవికుమార్ మంత్రి పదవి చేపట్టడటం ఆనందదాయకంగా ఉందన్నారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

ఒంగోలు(కల్చరల్), జూన్ 22: పద్మశ్రీ ఘంటసాల కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములో ఏర్పాటుచేసిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. సీనియర్ గాయని లక్ష్మీతులసి జన్మదినం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముందుగా ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరానికి చెందిన పలువురు కళాకారులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధుల నడుమ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యు.కోటేశ్వరరావు, లక్ష్మీతులసి, శేషారత్నం, డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, మువ్వా నాగేశ్వరరావు, మారుతీ, డి.శివప్రసాద్ తదితరులు పలు పాటలు పాడారు. ఈ సందర్భంగా రచయిత కుర్రా ప్రసాద్‌బాబును తెలుగు సాహిత్య పురస్కారంతో నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కీబోర్డుపై రవికుమార్, ప్యాడ్స్‌పై సురేష్, డ్రమ్స్ మోహన్, తబలాపై శివప్రసాద్‌లు వాద్య సహకారాన్ని అందజేయగా సయ్యద్ ఇస్మాయిల్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



రాజరాజేశ్వరి అమ్మవారు

ఒంగోలు(కల్చరల్), జూన్ 22: ఒంగోలు నగరం గద్దలగుంటపాలెంలో త్రిశక్తిపీఠం శ్రీరాజరాజేశ్వరి దేవస్థానంలో జరుగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు,కుంకుమలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు కౌండిన్యశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, క్షేత్రపాలక, వాస్తు, నవగ్రహ, మండపారాధన హోమాలు, చండీహోమం నిర్వహించారు. ధర్మకర్తలు భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

కొమరోలు, జూన్22: లారీ, మోటర్‌సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఇడమకల్లు క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు.. కొమరోలు మండలంలోని బొడ్డువానిపల్లి గ్రామానికి చెందిన కాలె గుర్రప్పడు పనిపై మోటర్‌సైకిల్‌పై యడవల్లి గ్రామానిక వెళ్తుంగా మార్గమధ్యలోని ఇడమకల్లు క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో గుర్రప్పడుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

ఇసుక డంప్ స్వాధీనం



పసుపుగల్లులో ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో సుబ్బారెడ్డి

ముండ్లమూరు, జూన్ 22: మండలంలోని పసుపుగల్లులో అద్దంకి-దర్శి ప్రధానరహదారి పక్కన ఒక రైతు పొలంలో అక్రమంగా నిల్వ ఉంచిన 633 టన్నుల ఇసుకడంప్‌ను శనివారం ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, ఎస్ఈబీ పోలీసులు, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు పెద్ద ఎత్తున ఇసుకను డంప్ చేశారు. అప్పట్లో పనిచేసిన రెవెన్యూ అధికారులు కేసు నమోదు చేయకపోవటంతో తిరిగి ఆర్డీవో సుబ్బారెడ్డి నేతృత్వంలో ఇసుక డంప్‌ను పరిశీలించారు. నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసి వీఆర్వో సుశీలరాణికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలోని చిలకలేరు, గుండ్లకమ్మ ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్ట రీత్యాచర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్‌వోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.మధుబాబు, ఎస్ఈబీ సీఐ సుందరరామయ్య, ఎస్ఐ వి.ఆంజనేయులు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు డాక్టర్ సీతారామయ్య


దామచర్లకు ఘన స్వాగతం పలుకుతున్న తెలుగు మహిళలు


ఎమ్మెల్యే దామచర్లపై పూలు చల్లుతున్న అభిమానులు

నగరం పసుపుమయం !

ఘనంగా ఎమ్మెల్యే దామచర్ల విజయోత్సవ ర్యాలీ

టీడీపీ కూటమి శ్రేణులతో కిక్కిరిసిన వీధులు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 22: ఒంగోలు నగరంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ విజయోత్సవ ర్యాలీతో వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. దామచర్లకు స్వాగతం పలికేందుకు పలు ప్రాంతాలలో 25కు పైగా భారీ క్రేన్లతో గజమాలలు ఏర్పాటు చేశారు. త్రోవగుంట నుంచి మొదలైన ఎమ్మెల్యే దామచర్ల విజయోత్సవ ర్యాలీతో ఒంగోలుకు పండగొచ్చింది అనేలా వాతావరణం కనిపించింది. ఎక్కడచూసినా పసుపుమయం. ఏ వీధిలో చూసినా దామచర్లకు శుభాకాంక్షలతో ఫ్లెక్సీలు, డీజేలతో, భారీ హోర్డింగ్‌లతో శనివారం సందడి వాతావరణం నెలకొంది. ఫ్లెక్సీలు, తోరణాలతో నగరం పసుపుమయం అయ్యింది.

అభిమానులకు భోజన ఏర్పాట్లు

దామచర్ల ఎమ్మెల్యేగా మరోసారి విజయం సాధించడంతో స్థానిక మినీ స్టేడియంలో అభిమానుల కోసం భారీ భోజన ఏర్పాట్లు చేశారు. సుమారు 15వేల మందికి రుచికరమైన వంటలు సిద్ధం చేసి వడ్డించారు. అలాగే దామచర్ల వారితో మాట్లాడుతూ తన విజయం కోసం కృషిచేసిన ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో పాలభిషేకం

మెప్మా ఆధ్వర్యంలో పొదుపు మహిళలు దామచర్లకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ర్యాలీలో నడిచారు. సీఎంఎం కొండయ్య నేతృత్వంలో స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్, మునిసిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.


కర్నూలురోడ్డులో ఎమ్మెల్యే జనార్దన్‌కు స్వాగతం పలుకుతున్న అశేష జనసందోహం

దుక్కులు దున్ని..ఆకాశం వైపు..!

వర్షాల కోసం రైతుల ఎదురుచూపు ● కలవర పెడుతున్న ఖరీఫ్ ● జాడలేని వరుణుడు


ఎర్రగొండపాలెం ప్రాంతంలో దుక్కులు దున్ని ఖాళీగా ఉంచిన పొలాలు


కంభంలో పెంపులేకుండా ఉన్న పత్తి మొక్కలు

ఎర్రగొండపాలెం, జూన్ 22 : దుక్కులు దున్ని రైతులు వర్షంకోసం ఎదురుచూస్తున్నారు. సాగుకు భూములను సిద్ధం చేసిన రైతులు వారం రోజులుగా భూమి పదును అయ్యే వర్షాలు ఎప్పుడు కురుస్తాయా అని ఆకాశం వైపు చూస్తున్నారు. పదును వర్షం కురిస్తే రైతులు ఖరీఫ్ పైర్లు సాగు చేసే అవకాశం ఉంది. ఎర్రగొండపాలెం మండలంలో వ్యవసాయశాఖ అంచనాల ప్రకార సాధారణ సాగు విస్తీర్ణం కంది 1,225 హెక్టార్లు, పత్తి 2,366 హెక్టార్లు, మిర్చి 2,942 హెక్టార్లు, ఆముదం 44 హెక్టార్లు, వరి 7 హెక్టార్లు, మినుము 34 హెక్టార్లు, జొన్న 4 హెక్టార్ల విస్తీరణంలో విత్తనాలను విత్తుకునేందుకు సాగుకు భూములను రైతులు సిద్ధం చేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే మండలంలో సాధారణ సాగును మించి ఖరీఫ్‌లో విత్తనాలు విత్తుకునేందుకు రైతులు ఉన్నట్లు వ్యవసాయాధికారి శేషారెడ్డి తెలిపారు.

కంభం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ నెల 2న రుతు పవనాలు రాగా, అనంతరం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీంతో జిల్లాలోని పశ్చిమ ప్రాంతాలు పొలాల్లో దుక్కిదున్నే వర్షాలు కురిశాయి. రైతులు కూడా ఆనందోత్సవాలతో సాగుకు సిద్ధమయ్యారు. పొలాలను దున్ని, ఈ సారైనా వర్షాలు బాగా కురిస్తే పత్తి, మొక్కజొన్న, సజ్జ, రాగి, తదితర మెట్టపైర్లు సాగు చేసుకొందామని ఆశపడ్డారు. తొలిలో మూడురోజులు మురిపించిన వాన అనంతరం ముఖం చాటేసింది. దీంతో రైతులు డీలా పడ్డారు. ముందుగా ఒక మోస్తారు వర్షం కురిసినా, పెద్దగా పైర్లను సాగు చేయలేదు. సకాలంలో వర్షాలు పడి వాతావరణం అనుకూలిస్తే డివిజన్‌లో ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి 30వేల హెక్టార్లకు పైగా సాగయ్యేదని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. దీనికితోడు కంది, రాగి, మిరప, పసుపు, మొక్కజొన్న తదితర పంటల్లో సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇక కొద్దిగొప్పో సాగు చేసిన వేసవి పైరులోనూ మొక్కలు పెంపులేక గిడసబారాయి.

మండుతున్న భానుడు

రాష్ట్రమంతా రుతుపవనాలు వ్యాపించినా ఆశించినంత మేర వర్షాలు కురవకపోవడంతో ఎండలు మండిపోతున్నాయి. వేడి, ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మే నెలలో ఉన్నట్లుగా ఉష్ణోగ్రత్తలు పెరగడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. వరుణుడి రాక కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని
మోటార్‌సైక్లిస్టు దుర్మరణం

పెంపుడు కుక్క మృతి ● మంటల్లో కాలిపోయిన వాహనం

ఒంగోలు(క్రైం), జూన్ 22: గుర్తుతెలియని వాహనం ఢీకొని మోటార్‌సైక్లిస్టు దుర్మరణం చెందడంతో పాటు తన వెంట ఉన్న పెంపుడు కుక్క చనిపోయింది. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి ఒంగోలు నగరం సంఘమిత్ర ఆసుపత్రి వెనుక జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. విజయవాడకు చెందిన సమాధి మహేష్‌బాబు తన మోటార్‌సైకిల్‌పై సింగరాయకుండలోని మూలగుంటపాడు తన బంధువుల ఇంటికి వెళుతున్నారు. తనతోపాటు పెంపుడు కుక్కను వాహనంపై తీసుకొని ప్రయాణిస్తుండగా గుర్తుతెలియని వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో కుక్కతో పాటుగా మహేష్‌బాబు రోడ్డు మీద పడ్డాడు. ఆయన హెల్మెట్ ధరించినప్పటికి తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమై అక్కడిక్కడే మృతి చెందాడు. కుక్కకు కూడా గాయాలపాలై మరణించింది. అదే సమయంలో మహేష్‌బాబు నడుపుతున్న మోటార్‌సైకిల్‌కు మంటలు వ్యాప్తించి కాలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.

రెండిళ్లలో చోరీ

మార్టూరు, జూన్ 22: మండలంలోని వలపర్లగ్రామంలో రెండు ఇళ్లల్లో చోరీ జరిగినట్లు ఏఎస్ఐ మహమ్మద్‌బాషా శనివారం తెలిపారు. వలపర్ల గ్రామంలోని షేక్ మాబులా, పర్చూరి సుకన్య అనే మహిళల ఇళ్లల్లో చోరీ జరిగింది. గ్రామంలోని పక్క పక్క వీధులలో నివాసం ఉండే వారిద్దరు విడివిడిగా గురువారం వేరే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చిన వారిద్దరు ఇంటికి వెళ్లి చూడగా తలుపులు తాళం పగలగొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గ్రహించారు. వారిలో సుకన్య ఇంటిలోని బీరువా తలుపులు తెరచి అందులోని దుస్తులు, వస్తువులను చెల్లా చెదురు చేశారు. అదేవిధంగా మాబులా ఇంటిలోని 11 గ్రాముల విలువైన బంగారపు చిన్న వస్తువులు,సుకన్య ఇంటిలోని 12 గ్రాముల బంగారు వస్తువులను దొంగలు ఎత్తుకు పోయినట్లు గమనించారు. దాంతో వారిద్దరు శనివారం సాయంత్రం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఏఎస్ఐ బాషా హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావులు వలపర్ల గ్రామం వెళ్లి దొంగతనం జరిగిన రెండు ఇళ్లను పరిశీలించారు. ఈ కాలనీలోని స్థానికులను విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు.

మొదలైన ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్ల రాజీనామాలు

ఆ పోస్టుల కోసం టీడీపీ నేతల ప్రయత్నాలు

దర్శి, జూన్ 22: దర్శి నియోజకవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్‌డీలర్ల రాజీనామాల పర్వం ఆరంభమైంది. కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు ఇప్పటికే స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. మిగిలినవారు అధికారులు తొలగించే వరకు కొనసాగాలని భావిస్తున్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం హయాంలో నియమితులైన డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను పూర్తిగా ప్రక్షాళన చేయాలని టీడీపీ నాయకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు వంద మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, మరో వందమంది డీలర్లు ఉన్నారు. దర్శి మండలంలో ఇప్పటికే తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామాలు చేశారు. అలాగే తాళ్ళూరు మండలంలో 8 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు డీలర్లు రాజీనామాలు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఎలాగైనా తొలగిస్తారనే ఉద్దేశంతో వారు స్వచ్ఛందంగా తప్పుకున్నారు. అధికశాతం మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు వైసీపీ కార్యకర్తల్లాగా వ్యవహరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు వేసే విషయంలో పక్షపాత వైఖరి అవలంబించారు. టీడీపీ వర్గీయులు పనులు చేసినప్పటికీ అనేక గ్రామాల్లో మస్టర్లు వేయకుండా ఇబ్బందిపెట్టారు. డీలర్లు కూడా అనేకమంది రేషన్ సక్రమంగా పంపిణీ చేయలేదు. ప్రతినెలా పదో తేదీలోగా అరకొరగా పంపిణీ చేసి అధికశాతం బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆపార్టీ నాయకులకు, డీలర్లకు బియ్యం వ్యాపారం కల్పవృక్షంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ప్రక్షాళనకు రంగం సిద్ధమైంది. దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్ వద్దకు టీడీపీ నాయకులు వెళ్లి ఆయా పోస్టులు ఇప్పించాలని కోరుతున్నారు. గ్రామాల్లో స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తలు, అధికశాతం మంది అడుగుతుండటంతో పోటీ తీవ్రమైంది. అన్నిగ్రామాల్లో స్థానిక నాయకులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తులను డీ లర్లుగా, ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని భావిస్తునట్లు తెలిసింది. రాజీనామాలు చేయకుండా కొనసాగుతున్న వారిని పంపించేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

నిందితులను వదలొద్దు : ఎంపీ కృష్ణప్రసాద్


హత్యాచారం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

చీరాల, జూన్ 22 : 'యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన అమానుషం. అనాగరికం. నిందితులు ఎవరినీ వదలం. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని' బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. చీరాల మండలం ఈపురుపాలెంలో శుక్రవారం యువతి పై హత్యాచార ఉదంతం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఎంపీ కృష్ణప్రసాద్ ఈపురుపాలెం వచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా ఉంటామని చెప్పారు. నిందితులను ఎవరిని వదిలిపెట్టమని చెప్పారు. ఘటన పూర్వాపరాలను డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఘటన జరిగిన ప్రదేశంకు పక్కనే ఉన్న బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ప్రహరీ గోడపై కొందరు అప్పుడప్పుడు కూర్చుంటారనే కోణంలో వివరాలు అడిగి తెసుకున్నారు. స్కూలు విద్యార్థినులతో మాట్లాడారు. ఎంపీ వెంట టీడీపీ నాయకులు నాతాని ఉమామహేశ్వరరావు, గుద్దంటి చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ఒడ్డుకు చేరిన మరో ఇద్దరి మృతదేహాలు

రామాపురం(చీరాలటౌన్), జూన్ 22 : బాపట్ల జిల్లా రామాపురం తీరంలో శుక్రవారం గల్లంతయిన ఇద్దరి మృతదేహాలు శనివారం ఉదయం సమీపంలోనే ఒడ్డుకు చేరాయి. ఏలూరు జిల్లా పెద్దవేగి మండలం దుగ్గిరాల గ్రామానికి చెందిన జాలా కిషోర్(26), గొటుకుల తేజ(19), కోరు అమల్‌రాజు(19), చెట్టుమాల నితిన్(19), గౌతమ్, సాగర్, బుచికి, మోహన్, తేజ, సునీల్, రామరాజు, మురళి స్నేహితులు. వీరంతా రామాపురం సముద్రంలో మునిగేందుకు వ్యాన్‌లో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో వచ్చారు. అరగంట పాటు భోజనం చేశారు. 2:30.నిమిషాలకు సముద్రంలో దిగి 5 నిముషాలు మాత్రమే మునిగారు. అప్పటి వరకు కనీసం వీరి తలలు కూడా తడవలేదు. ఇంతలో ఒక్కసారిగా కెరటాలు తాకిడికి అంతా లోనికి కొట్టుకుపోయారు. అదృష్టవశాత్తు ఏడుగురు బయటకు రాగా కిషోర్, గొటుకుల తేజ, నితిన్, అమల్‌రాజా లోనికి కొట్టుకుపోయారు. దీంతో సహచరులు బిగ్గరగా కేకలు వేయగా మెరైన్, రూరల్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే కొద్దిసేపటికే గొటుకుల తేజ, జాలా కిషోర్ మృతదేహాలు ఒడ్డుకు రాగా, నితిన్, అమల్‌రాజా జాడకోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఎట్టకేలకు సమీపంలోనే శనివారం ఉదయం మిగిలిన ఇద్దరి మృతదేహాలు ఒడ్డుకు చేరాయి. దీంతో కేసు నమోదుచేసుకున్న ఈపూరుపాలెం పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే అమల్ రాజా తండ్రి గతంలోనే మృతిచెందగా, తాత గతేడాది ఇదేరోజు మృతిచెందాడు. సోదరి, తల్లికి అండగా ఉన్న అమల్‌రాజా కూడా మృతిచెందడంతో ఆకుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

శంకరాపురంలో పోలీసు పికెట్

ముండ్లమూరు, జూన్ 22: శంకరాపురంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో శుక్రవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈక్రమంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శనివారం పోలీసు పికెట్ ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ వి.ఆంజనేయులు తెలిపారు. మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, ఇటీవల టీడీపీలో చేరిన మేదరమెట్ల కోదండరామయ్య వర్గీయుల మధ్య జరిగిన గొడవల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

దుక్కులు దున్ని.. ఆకాశం వైపు..

● వర్షాల కోసం రైతుల ఎదురు చూపు ● కలవర పెడుతున్న ఖరీఫ్ ● జాడలేని వరుణుడు ● మండుతున్న భానుడు



ఎర్రగొండపాలెం ప్రాంతంలో దుక్కులు దున్ని ఖాళీగా ఉంచిన పొలాలు

ఎర్రగొండపాలెం, జూన్ 22 : దుక్కులు దున్ని రైతులు వర్షంకోసం ఎదురుచూస్తున్నారు. సాగుకు భూములను సిద్ధం చేసిన రైతులు వారం రోజులుగా భూమి పదును అయ్యే వర్షాలు ఎప్పుడు కురుస్తాయా అని ఆకాశం వైపు చూస్తున్నారు. పదును వర్షం కురిస్తే రైతులు ఖరీఫ్ పైర్లు సాగు చేసే అవకాశం ఉంది. ఎర్రగొండపాలెం మండలంలో వ్యవసాయశాఖ అంచనాల ప్రకార సాధారణ సాగు విస్తీర్ణం కంది 1,225 హెక్టార్లు, పత్తి 2,366 హెక్టార్లు, మిర్చి 2,942 హెక్టార్లు, ఆముదం 44 హెక్టార్లు, వరి 7 హెక్టార్లు, మినుము 34 హెక్టార్లు, జొన్న 4 హెక్టార్ల విస్తీరణంలో విత్తనాలను విత్తుకునేందుకు సాగుకు భూములను రైతులు సిద్ధం చేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే మండలంలో సాధారణ సాగును మించి ఖరీఫ్‌లో విత్తనాలు విత్తుకునేందుకు రైతులు ఉన్నట్లు వ్యవసాయాధికారి శేషారెడ్డి తెలిపారు.

కంభం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ నెల 2న రుతు పవనాలు రాగా, అనంతరం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీంతో జిల్లాలోని పశ్చిమ ప్రాంతాలు పొలాల్లో దుక్కిదున్నే వర్షాలు కురిశాయి. రైతులు కూడా ఆనందోత్సవాలతో సాగుకు సిద్ధమయ్యారు. పొలాలను దున్ని, ఈ సారైనా వర్షాలు బాగా కురిస్తే పత్తి, మొక్కజొన్న, సజ్జ, రాగి, తదితర మెట్టపైర్లు సాగు చేసుకొందా మని ఆశపడ్డారు. తొలిలో మూడురోజులు మురిపించిన వాన అనంతరం ముఖం చాటేసింది. దీంతో రైతులు డీలా పడ్డారు. ముందుగా ఒక మోస్తారు వర్షం కురిసినా, పెద్దగా పైర్లను సాగు చేయలేదు. సకాలంలో వర్షాలు పడి వాతావరణం అనుకూలిస్తే డివిజన్‌లో ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి 30వేల హెక్టార్లకు పైగా సాగయ్యేదని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. దీనికితోడు కంది, రాగి, మిరప, పసుపు, మొక్కజొన్న తదితర పంటల్లో సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇక కొద్దిగొప్పో సాగు చేసిన వేసవి పైరులోనూ మొక్కలు పెంపులేక గిడసబారాయి.





కంభంలో పెంపులేకుండా ఉన్న పత్తి మొక్కలు, ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

మండుతున్న భానుడు

రాష్ట్రమంతా రుతుపవనాలు వ్యాపించినా ఆశించినంత మేర వర్షాలు కురవకపోవడంతో ఎండలు మండిపోతున్నాయి. వేడి, ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మే నెలలో ఉన్నట్లుగా ఉష్ణోగ్రత్తలు పెరగడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. వరుణుడి రాక కోసం రైతులు, ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

లారీ-మోటర్ సైకిల్ ఢీ

● మోటార్ సైకిలిస్టుకు గాయాలు



ప్రమాదానికి గురైన లారీ, మోటర్ సైకిల్

కొమరోలు, జూన్22: లారీ- మోటర్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఇడమకల్లు క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు.. కొమరోలు మండలంలోని బోడ్డువానిపల్లి గ్రామానికి చెందిన కాలె గుర్రప్పడు పనిపై బోడ్డువానిపల్లి నుంచి మోటర్ సైకిల్‌పై యడవల్లి గ్రామానిక వెళ్తుంగా మార్గమధ్యలోని ఇడమకల్లు క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో గుర్రప్పడుకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని స్థానికులు గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

పేద విద్యార్థుల చదువుపై దృష్టి పెట్టాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 22: పేద విద్యార్థుల చదువుపై ప్రభుత్వం దృష్టి సారించాలని, ఎంపీజే నాయకులు పేర్కొన్నారు. విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఎంపీజే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాసోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు వీధుల్లో ఎంపీజే సభ్యులు పర్యటించారు. చదువు మానుకొని పనులకు వెళ్లే పిల్లలను పాఠశాలలకు పంపించమని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు రజాక్ మాట్లాడుతూ.. చాలా మంది నిరుపేదల పిల్లలు పూట గడవక పనులకు వెళ్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రకటనలకే పరిమితం అవుతూ వారిని విద్యవైపు మళ్లించటం లేదన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో వసతులు లేకపోయినా ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే నాయకులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి

పొదిలి, జూన్ 22 : యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ మల్లికార్జునరావు అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల దుష్ప్రరిణామాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యుక్తవయసులో మాదకద్రవ్యాలకు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందన్నారు. వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. యుక్తవయసులో అలవాటుగా మారే ప్రమాదం ఉందని చెడువైపునకు వెళ్లకూడదని విద్యార్థులకు సూచించారు. ఆనందమయ జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ వాడుతున్నట్లు ఏమైనా సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ 14500 నంబరుతో పాటు ప్రకాశం పోలీస్ 9121102266 నెంబరుకు తెలియజేయాలన్నారు. యువత మాదకద్రవ్యాల వైపు వెళ్లకుండా మంచి చదువులు చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తారావాణి, ఎస్ఐ కోటయ్య విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హత్యాయత్నం ఘటనలో 33 మందిపై కేసు

అద్దంకి, జూన్ 22: హత్యాయత్నం సంఘటనకు సంబంధించి 33 మంది పై అద్దంకి పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు ముండ్లమూరు మండలం శంకరాపురంకు చెందిన రెండు వర్గాలకు చెందిన వ్యక్తుల మధ్య వివాదం చోటు చేసుకొని చివరకు ఓ వర్గం మూకుమ్మడిగా శుక్రవారం రాత్రి మరో వర్గంపై దాడి చేయటంతో ఐదుగురుకి గాయాలు అయ్యాయి. తిమ్మాయపాలెం సమీపంలోని ఇటుకబట్టీల వద్ద మందలపు శివకృష్ణ తో పాటు మరో నలుగురుపై అదే గ్రామానికి చెందిన మందలపు వెంకటరావుతో పాటు మరో 32 మంది మూకుమ్మడిగా దాడి చేయటంతో గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఒంగోలు వైద్యశాలకు తరలించారు. శివకృష్ణ ఫిర్యాదు మేరకు 33 మందిపై కేసు నమోదు చేసినట్లు మహిళా ఎస్సై రత్నకుమారి తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పొదిలి, జూన్ 22 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పలు వీధులలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. కాలువల్లో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించి వ్యాధులు ప్రబలకుండా ఎబెట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. మురుగు కాలువలు, కుంటలు, పాతటైర్లలో నీరు నిల్వలు లేకుండా చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించారు. అలాచేయడం ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కనుక ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

● ఎంఈవో మస్తాన్ నాయక్



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులు

పెద్ద దోర్నాల, జూన్ 22: బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండేలా తల్లిదండ్రులు తోడ్పడాలని ఎంఈవో మస్తాన్‌నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 'బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని అవగాహన కల్పించారు. 'పెద్దలు పనికి, పిల్లలు బడికి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో మస్తాన్‌నాయక్ మాట్లాడుతూ మండలంలోని ఆయా పాఠశాలల పరిధిలోని బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశమై అవగాహన కల్పించాలని, పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎప్పటికపుడు విద్యార్థుల స్థితిగతులపై వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది వీ నాగమూర్తి, రామానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బడికి పోతా

గిద్దలూరు : 'నేను బడికి పోతా' అనే అంశంపై విద్యాశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాచర్లలో ర్యాలీ నిర్వహించారు. రాచర్ల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ళ లోపు వయస్సు ఉన్న వారిని ఇంటింటికి వెళ్ళి గుర్తించి బడిలో చేర్చాల్సిన ఆవశ్యకత గురించి వారికి, తల్లిదండ్రులకు చెప్పి పాఠశాలలో చేర్పించాలని పేర్కొన్నారు. వారికి వెంటనే స్టూడెంట్స్ కిట్స్ అందజేయాలన్నారు. వారి సామర్థ్యం పరిశీలించి వయస్సుకు తగిన తరగతిలో చేర్చాలని, బడిబయట ఉన్న విద్యార్థులకు బడిలో చేర్చేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంఈవోలు శివకోటేశ్వరరావు, గిరిధరశర్మ, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిథిలమైన చెత్త సేకరణ ఆటోలు

వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం



ప్రారంభించకుండానే శిథిలమైన ఎలక్ట్రిక్ చెత్త సేకరణ ఆటోలు

మార్కాపురం రూరల్, జూన్ 22: గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రారంభం కాకుండానే చెత్త సేకరణ ఎలక్ట్రికల్ ఆటోలు శిథిలమైపోయాయి. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 2018వ సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ నిధుల ద్వారా మార్కాపురం మండలానికి 15 ఎలక్ట్రిక్ చెత్త సేకరణ ఆటోలు మంజూరయ్యాయి. 2019 ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అప్పటికే మంజూరైన ఎలక్ట్రిక్ చెత్త సేకరణ ఆటోలను ఉపయోగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆటోలు శిథిలమైపోయాయి. మార్కాపురం మండలానికి 15 చెత్త సేకరణ ఆటోలను అప్పటి అధికారులు మంజూరు చేశారు. వాటి విలువ సుమారు రూ.30లక్షలకు పైగానే ఉంటుందని అంటున్నారు. ఓ వైపు గ్రామాలలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి అధ్వానంగా పారిశుధ్య ఉన్న పరిస్థితులు కనిపిస్తుంటే అధికారులు, గత వైసీపీ ప్రభుత్వ పాలకులు ప్రభుత్వం మంజూరు చేసిన ఆటోలను ఇలా నిర్లక్ష్యంగా శిథిలమైపోయే విధంగా వ్యవహరించటం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం అంటూ ఫొటోలకు ఫోజులు ఇవ్వడమే తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులను చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజా ధనాన్ని ఇలా దుర్వినియోగం చేయడం మంచి పద్ధతి కాదని ప్రజలు విమర్శిస్తున్నారు. నిర్లక్ష్యంతో ఆటోలను శిథిలావస్థకు చేర్చిన పాలకులపై, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యులు డుమ్మా

పది రోజులుగా పీహెచ్‌సీకి రాని డాక్టర్లు

రోగుల ఇబ్బందులు

వెలవెలబోతున్న ఆరోగ్య కేంద్రం



పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టరు కుర్చీలు

తర్లుపాడు, జూన్ 19: తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది రోజుల నుంచి వివిధ సాకులతో వైద్యులు ఆరోగ్య కేంద్రానికి రాకపోవటంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. ఇద్దరూ కూడా విధులకు సక్రమంగా రాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకరు కచ్చితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉండి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా.. మరొకరు 104 వాహనంలో వివిధ గ్రామాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలి. కానీ తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఇద్దరు వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు వైద్యులు లేరని తెలుసుకొని ఇంటిదారి పడుతున్నారు. కొందరు రోగులు విధిలేని పరిస్థితుల్లో మార్కాపురం ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లి వేలకు వేలు వెచ్చించి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వైద్యులే సక్రమంగా రాకపోతుండటంతో సిబ్బంది కూడా ఇష్టానుసారంగా వస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు ఏఎన్ఎంలు వైద్య పరీక్షలు నిర్వహించి ట్యాబ్లెట్లు ఇచ్చి పంపిస్తున్నారు.



రోగులు లేక వెలవెలబోతున్న ఆసుపత్రి

గతంలో తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాహుల్, డాక్టర్ వంశీ ఉన్న సమయంలో సుమారు రోజుకు 150 ఓపీలు వచ్చేవి. ప్రస్తుతం 20 నుంచి 30 ఓపీలు మాత్రమే వస్తున్నాయి. ప్రస్తుతం ఇరువురు అనుభవం లేని డాక్టర్లు ఉండటంతో రోగులు సరైన వైద్యం అందక ఇబ్బందులకు గురవుతున్నారు. గర్భిణులు కూడా కాన్పులు చేయించుకునేందుకు మార్కాపురం వెళ్లాల్సి వస్తోంది. ఈ నెల 19న కూడా 15 మంది రోగులు బొందలపాడు నుంచి వచ్చి డాక్టర్లు లేక పోవటంతో ఆటోలో తిరిగి వెళ్లారు. ఈ విషయాన్ని మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌వో రాహుల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఒక డాక్టరైనా ఆరోగ్య కేంద్రంలో ఉండాల్సి ఉంది అని, విధులకు హాజరుకాని డాక్టర్లపై విచారణ జరిపి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

నారాయణరెడ్డి గెలుపుపై ఆర్యవైశ్యులు హర్షం

పొదిలి, జూన్ 22 : మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిలు అఖండ విజయం సాధించడం, శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కందుల నారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డి గెలుపుకు కృషి చేసిన ఆర్యవైశ్యులు అందరు ఒకేతాటిపై ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కలిసిరావాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న గునుపూడి భాస్కర్ నాయకత్వాన్ని బలపరిచి ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో ముందుకు వెళదామన్నారు. తన మాటకు విలువనిచ్చి కందుల గెలుపుకు తోడ్పాటును అందించిన ప్రతి ఒక్కరికి గునుపూడి భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గునుపూడి దంపతులను వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



ఇమాంసాను సన్మానిస్తున్న ముస్లింలు



కేకు కట్ చేస్తున్న ఆర్యవైశ్యులు

డాక్టర్ ఇమాంసాకు సన్మానం

పొదిలి : పొదిలి పట్టణంలోని 11వ వార్డులో ఎంపీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ ఇమామ్‌సాను శనివారం ముస్లింలు ఘనంగా సన్మానించారు. మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విజయంలో కీలకపాత్ర పోషించిన డాక్టర్ ఇమామ్‌సాను 11 వార్డులోని ముస్లింలు సన్మానించారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

కొనకనమిట్ల, జూన్ 22 : మండలంలోని వాగుమడుగు గ్రామంలో వెలసిన పోలేరమ్మ తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లకు పలు మండలాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజారులు అమ్మవారిని నిమ్మ కాయల దండలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారిగుడికి రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. తిరుణాళ్ళకు వచ్చిన భక్తులు ఉదయం నుండి ఒక్కపొద్దులు ఉండి బోణాలతో అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రభలపై పాటకచేరీలు, పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బధ్రతా ఏర్పాటు చేశారు.





పోలేరమ్మ మూలవిరాట్, హాజరైన భక్తులు

అసంపూర్తిగా అదనపు తరగతి గదుల నిర్మాణం

● నిధుల లేమితో నిలిచిన పనులు
● 29 పాఠశాలల్లో అదే పరిస్థితి

పెద్ద దోర్నాల, జూన్ 22: పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంది. ఈ క్రమంలో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని వసతుల కల్పనలో భాగంగా నాడు-నేడు కార్యక్రమం చేపట్టింది. అది కూడా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాకుండా చివరి సంవత్సరాల్లో ప్రారంభించింది. ప్రాథమికంగా విద్యార్థులకు తగిన తరగతి గదులను ఏర్పాటు చేసే నిమిత్తం అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటి చైర్మన్ జాయింట్ అకౌంటుతో బిల్లులు అరకొరగా విడుదల చేయడంతో నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మండలంలో 29 పాఠశాలల్లో 40 అదనపు తరగతులు మంజూరయ్యాయి. అన్నీ 75శాతం పనులు పూర్తయ్యాయి. 25శాతం పనులు మిగిలి ఉండడంతో విద్యార్థులకు అందుబాటులోకి రాలేదు. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించినా విద్యార్థులకు ఉపయోగపడలేదు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయంలోనే పాఠశాలల పునఃప్రారంభమయ్యాయి. ఈ ప్రభుత్వమైన త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చి విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.



నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం

అవీ..ఇవీ..

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

కంభం, జూన్ 22 : వ్యవసాయశాఖ నుంచి 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేయనున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్ తెలిపారు. శనివారం కంభం-1 రైతు భరోసాకేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం వారు రైతుశిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతులకు వివిధ పైర్ల సాగుపై మెళకువలు నేర్పించారు. పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసి పూతకు వచ్చినపుడు భూమిలో కలియదున్నితే సేంద్రీయ కర్బనం పెరుగుతుందన్నారు. అనంతరం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజరాణి మాట్లాడుతూ వ్యవసాయంలో జీవన ఎరువులు, సేంద్రీయ ఎరువుల ప్రాముఖ్యత, వాటి వినియోగాల గురించి వివరించారు. కంభం ఏవో స్వరూప మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే ప్రధాన పైర్లు వాటి సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో బి.వెంకటశేషమ్మ, ఉద్యావన శాఖాధికారిణి శ్వేత, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, ఎంఈవో

కొమరోలు, జూన్ 22: విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో నరశింహరావు సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో నరసింహారావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిని ప్రతి ఉపాధ్యాయుడు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బోర్రా వెంకటత్నం, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నెమలిగుండ్లకు పోటెత్తిన భక్తులు

గిద్దలూరు, జూన్ 22 : రాచర్ల మండలంలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. నెమలిగుండంలో స్నానాలు ఆచరించి కొండపైన వెలసిన శ్రీ రంగనాయకస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇంటి ఇలవేల్పుగా రంగనాయకస్వామిని కొలిచేవారు తలనీలాలు సమర్పించుకున్నారు. ముడుపులు చెల్లించి పూజలు నిర్వహించారు. ఆయా వర్గాల అన్నసత్రాలలో దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నేడు బలిదాన్ దివాస్

గిద్దలూరు, జూన్ 22 : జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని బూత్‌స్థాయి నుంచి శక్తి కేంద్రాల వరకు ఈ నెల 23న నిర్వహించాలని బీజేపీ సమన్వయకర్త మంచాల బ్రహ్మేశ్వరప్రసాద్, ఉపసమన్వయకర్త గుమ్మా రాముడు ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులను కోరారు. నియోజకవర్గంలోని 6 మండలాల్లో బూత్‌స్థాయిలో, శక్తికేంద్రాల వద్ద శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇందులో ప్రజలను భాగస్వాములను చేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 22: స్థానిక కంభం రోడ్డులోని శివాజీ నగర్‌లో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 24న ఉదయం ధ్వజారోహణం అనంతరం శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ ఛైర్మన్ టి.పి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొండలరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న హనుమంత వాహనం అనంతరం, కల్యాణం రాత్రి 7గంటలకు రథోత్సవం నిర్వహిస్తామన్నారు. 26న అశ్వవాహన సేవ, 27న ఊంజల్ సేవ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

వైభవంగా చెన్నకేశవుని కల్యాణం



శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 22: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వారికి శాంతికల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఎంపీడీవోను కలిసిన టీడీపీ నాయకులు



ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

మార్కాపురం రూరల్, జూన్ 22: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో తోట చందనను టీడీపీ మండల అధ్యక్షుడు జవ్వాజి రామానుజులరెడ్డి, పార్టీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలని కోరారు. గ్రామీణప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా త్వరితగతిన అందేవిధంగా కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే రాయితీలు, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. గ్రామాలలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి, ముడియాల అశోక్‌రెడ్డి, బట్టలు వెంకటేశ్వర్లు, జంకె రమణారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ అభివృద్ధి

● దూపాడు సర్పంచ్ అనూష



మాట్లాడుతున్న సర్పంచ్ ఎనిబెర అనూష

త్రిపురాంతకం, జూన్ 22: విద్యతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమని దూపాడు గ్రామ సర్పంచ్ ఎనిబెర అనూష అన్నారు. మండలంలోని దూపాడు పంచాయితీ హసానపురంలో విద్యాశాఖ అధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ బడిబయట పిల్లల్ని బడిలో చేర్పించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు, బడిలో అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే ఆ కుటుంబంతోపాటు గ్రామం అన్ని రంగాలలో ముందుంటుందన్నారు. ఉన్నత పాఠశాలకు దూపాడుకు నడిచి వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తన సొంత నిధులతో ఆటోను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో కేటీ.మల్లిఖార్జున నాయక్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాధవరంలో సాగుతున్న కాలువల పూడిక తీత పనులు

మాధవరంలో పారిశుధ్య పనులు

తాళ్లూరు, జూన్ 22: మండలంలోని మాధవరం గ్రామంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగుకాలువలు పూడికపోయి ఉండటంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతుంది. మురుగునీటితో దోమలు ఉధృతి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఎంపీపీ సూచనతో గ్రామ పంచాయతీ అధికారులు యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు, పలు వీధుల్లో మురుగు కాలువలు పూడిపోయి మురుగునీరు దిగువకు ప్రవహించటంలేదు. మురుగు కాలువ పూడికతీత పనులు చేపట్టి రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దొనకొండ, జూన్ 22: దొనకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దొనకొండ, ఇండ్ల చెరువు, పోలేపల్లి, గంగదేవిపల్లి గ్రామాలకు ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ నాగూర్‌షరీఫ్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

హైస్కూల్ విద్యార్థులకు కిట్లు పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జయమ్మ

పామూరు, జూన్ 22 : మండలంలోని వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న కిట్లను సర్పంచ్ పువ్వాడి జయమ్మ పంపిణీ చేశారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యా బోధనతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో పువ్వాడి రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మారెళ్లలో అంకాలమ్మకు పొంగళ్లు



అంకాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ముండ్లమూరు, జూన్ 22: మండలంలోని మారెళ్ల గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత అంకాలమ్మ అమ్మవారి నెల పొంగళ్లు శనివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతర జరిగి నేటికి నెల రోజులు కావటంతో భక్తులు తెల్లవారు జామునే నూతన వస్త్రాలు ధరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంటి వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యాన్ని తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. తమ పిల్లా పాపలను చల్లంగా చూడాలంటూ వేడుకున్నారు. అంకాలమ్మకు ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

మొదలైన ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్ల రాజీనామాల పర్వం

» ఆ పోస్టుల కోసం టీడీపీ నేతల ప్రయత్నాలు

దర్శి, జూన్ 22: దర్శి నియోజకవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, రేషన్‌డీలర్ల రాజీనామాల పర్వం ఆరంభమైంది. కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు ఇప్పటికే స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. మిగిలినవారు అధికారులు తొలగించే వరకు కొనసాగాలని భావిస్తున్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం హయాంలో నియమితులైన డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను పూర్తిగా ప్రక్షాళన చేయాలని టీడీపీ నాయకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు వంద మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, మరో వందమంది డీలర్లు ఉన్నారు. దర్శి మండలంలో ఇప్పటికే తొమ్మిది మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామాలు చేశారు. అలాగే, తాళ్ళూరు మండలంలో 8 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు డీలర్లు రాజీనామాలు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఎలాగైనా తొలగిస్తారనే ఉద్దేశంతో వారు స్వచ్ఛందంగా తప్పుకున్నారు. అధికశాతం మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు వైసీపీ కార్యకర్తల్లాగా వ్యవహరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు వేసే విషయంలో పక్షపాత వైఖరి అవలంబించారు. టీడీపీ వర్గీయులు పనులు చేసినప్పటికీ అనేక గ్రామాల్లో మస్టర్లు వేయకుండా ఇబ్బంది పెట్టారు. డీలర్లు కూడా అనేకమంది రేషన్ సక్రమంగా పంపిణీ చేయలేదు. ప్రతినెలా పదో తేదీలోగా అరకొరగా పంపిణీ చేసి అధికశాతం బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆపార్టీ నాయకులకు, డీలర్లకు బియ్యం వ్యాపారం కల్పవృక్షంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ప్రక్షాళనకు రంగం సిద్ధమైంది. దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్ వద్దకు టీడీపీ నాయకులు వెళ్లి ఆపోస్టులు ఇప్పించాలని కోరుతున్నారు. గ్రామాల్లో స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్ పోస్టులను అధికశాతం మంది అడుగుతుండటంతో పోటీ తీవ్రమైంది. అన్నిగ్రామాల్లో స్థానిక నాయకులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తులను డీలర్లుగా, ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని భావిస్తున్నట్లు తెలిసింది. రాజీనామాలు చేయకుండా కొనసాగుతున్న వారిని పంపించేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

అద్దె భవనంలో గ్రంథాలయం

» అరకొర వసతులతో పాఠకుల అవస్థలు



అద్దె భవనంలో నడుస్తున్న గ్రంథాలయం

దర్శి, జూన్ 22: దర్శి పట్టణంలో ఏళ్ల తరబడి గ్రంథాలయం అద్దె భవనంలో నడుస్తోంది. అరకొర వసతులతో పూర్తిస్థాయిలో పుస్తకాలు అందుబాటులో లేక మొక్కుబడిగా సాగుతోంది. పాలకులు చాలినన్ని నిధులు ఇవ్వక పోవటంతో ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటుతో అధికారులు గ్రంథాలయాన్ని నడుపుతున్నారు. దర్శిలో గత 50 సంవత్సరాలుగా గ్రంథాలయం కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకు సొంత భవనానికి నోచుకోలేదు.

2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గ్రంథాలయ భవనం కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో 3 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఏకారణం చేతనో నిర్మాణానికి నోచుకోలేదు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గ్రంథాలయం గురించి పట్టించుకోలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నూతన భవనం నిర్మాణంపై ఆశలు చిగురించాయి గతంలో కేటాయించిన స్థలంలో భవనం నిర్మించేందుకు నిధులు విడుదల చేయాలని పాఠకులు కోరుతున్నారు. అలాగే, పాఠకులు చదువుకునేందుకు వీలుగా అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



స్వామి విగ్రహన్ని గ్రామోత్సవం చేస్తున్న భక్తులు



శోభయాత్రలో కోలాటం చేస్తున్న బాలికలు

పామూరు, జూన్ 22: పామూరు పట్టణంలో శనివారం ఆర్ఎస్ఎస్, భజరంగదళ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన వీర హనుమాన్ శోభాయాత్ర వైభవంగా సాగింది. స్థానిక మదన వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద నుంచి డప్పులు, మేళాలు, డీజే, సౌండ్స్‌తో ఆంజనేయ స్వామి భారి విగ్రహన్ని ప్రత్యేక వాహనంలో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర సాగింది. పట్టణ ప్రధాన కూడలి ప్రాంతంలో చేసిన కోలాటం, ప్రత్యేక విన్యాసాలు ఆకట్టుకొన్నాయి. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా టీడీపీ నాయకులు బొయిళ్ల నారాయణరెడ్డి, యారవ శ్రీను, దరిశి రాము, ఎస్వీ నారాయణ దాతల సహకారంతో మహాప్రసాదం, మజ్జిగ, మంచినీరును సమకూర్చారు. శోభాయాత్ర సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కనిగిరి డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో సీఐ రామానాయక్ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో కేవీ రమణయ్య, జె.చినసుబ్బయ్య, యారం శ్రీను, ఎన్.సాంబయ్య, కె.గోపాల్, వి. బాబురావు, పిడుగుశ్రీను, వి.రాఘవ, గుత్తి రాజా, వై.బాలకొండలరావు, పందిటి హరీష్, మెంటా నరసింహారావు, వరికూటి చిరంజీవి, వల్లంశెట్టి సుధాకర్, దరిశి మస్తాన్‌రావు, గురు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వఉంచిన ఇసుక డంప్ స్వాధీనం



పసుపుగల్లులో నిల్వ ఉన్న ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో సుబ్బారెడ్డి

ముండ్లమూరు, జూన్ 22: మండలంలోని పసుపుగల్లులో అద్దంకి - దర్శి ప్రధాన రహదారి పక్కన ఒక రైతు పొలంలో అక్రమంగా నిల్వ ఉంచిన 633 టన్నుల ఇసుక డంప్‌ను శనివారం ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, ఎస్ఈబీ పోలీసులు, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు పెద్ద ఎత్తున ఇసుకను డంప్ చేశారు. అప్పట్లో పనిచేసిన రెవెన్యూ అధికారులు కేసు నమోదు చేయకపోవటంతో తిరిగి ఆర్డీవో సుబ్బారెడ్డి నేతృత్వంలో ఇసుక డంప్‌ను పరిశీలించారు. నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసి వీఆర్వో సుశీలరాణికి అప్పగించారు.

ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలంలోని చిలకలేరు, గుండ్లకమ్మ ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యాచర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.మధుబాబు, ఎస్ఈబీ సీఐ సుందరరావయ్య, ఎస్ఐ వి.ఆంజనేయులు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి స్వామిని సన్మానించిన టీడీపీ నాయకులు



మంత్రి స్వామిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

దొనకొండ, జూన్ 22: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిని శనివారం దొనకొండ మండల టీడీపీ నాయకులు రాష్ట్ర సచివాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. మండల టీడీపీ సీనియర్ నాయకులు కామేపల్లి చెంచయ్య, వల్లపునేని ఆదినారాయణ, మరికొందరు మంత్రి స్వామికి బొకే అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. జిల్లా లో ఎంతో వెనుకబడిన దొనకొండ ప్రాంతం అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ప్రధానంగా పేద కుటుంబాలకు చెందిన బాలికల విద్యా భివృద్ధికి కేజీబీవీ పాఠశాలలో సీట్లు సంఖ్య పెంచాలని, బాలికల హాస్టల్ దొనకొండలో ఏర్పాటుచేయాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కామేపల్లి చెంచయ్య తెలిపారు.

ప్రతి చిన్నారిని బడిబాట పట్టించాలి

కనిగిరి, జూన్ 22: బడి ఈడు పిల్లలందరినీ బడి బాట పట్టించాలని ఎంపీపీ ప్రకాశం అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఆయా సచివాలయాల పరిధిలో గల బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. చదువు మధ్యలోనే ఆపేసిన వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక సర్వే చేయించి సంబంధిత రిపోర్టులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో ఏఈవోలు డీవీ సుబ్బారావు, యూవీ నారాయణరెడ్డి, ఈవోపీఆర్డీ అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

» పోలీసు బందోబస్తు మధ్య ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం



పోలీసు బందోబస్తు మధ్య ఉత్సవ విగ్రహాలగ్రామోత్సవం

పీసీపల్లి, జూన్ 22: రెండు సంవత్సరాల క్రితం పీసీపల్లిలో సీతారామ లక్ష్మణ హనుమాన్ సమేత ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం నిలిచిపోయింది. కమిటీసభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సీతారాముల కల్యాణంతో పాటు ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం నిలిచిపోయింది. అప్పట్లో పోలీసుస్టేషన్‌లో పంచాయితీ నిర్వహించినా కమిటీసభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. లక్షలాది రూపాయలు వెచ్చించి రాముల వారి ఆలయాన్ని పునర్నిర్మించినప్పటికీ గ్రామోత్సవం నిర్వహించలేదు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి రాములవారి కల్యాణంతో పాటు నిలిచిపోయిన గ్రామోత్సవాన్ని, అప్పటి సంఘటనలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి సీతారాముల గ్రామోత్సవానికి ఎటువంటి ఆటంకం లేకుండా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కనిగిరి సీఐ వెంకటేశ్వరరావు పీసీపల్లికి వచ్చి కమిటీసభ్యులతో మాట్లాడి ప్రశాంతంగా రాములవారి కల్యాణం జరిపించి గ్రామోత్సవం నిర్వహించుకోవాలని ఆదేశించారు. అందులో భాగంగా శనివారం రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. రెండు సంవత్సరాల నాటి సంఘటనను దృష్టిలో పెట్టుకున్న పోలీసులు గ్రామోత్సవం సమయంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా కనిగిరి ఎస్సై త్యాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

26న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పామూరు, జూన్ 22: పామూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26న ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పుట్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.



మంత్రి రవికుమార్‌కు అభినందనలు తెలుపుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అభినందనలు

దర్శి జూన్ 22: రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌కు దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్ ,మామయ్య కడియాల వెంకటేశ్వర్లు, కడియాల రమేష్‌లు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ఐదుసార్లు వరుసగా శాసనసభ్యునిగా గెలుపొంది బాబాయి రవికుమార్ మంత్రి పదవి చేపట్టడటం ఆనందదాయకంగా ఉందన్నారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

శంకరాపురంలో పోలీసు పికెట్

ముండ్లమూరు, జూన్ 22: మండలంలోని శంకరాపురంలో పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు. గ్రామంలో శుక్రవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈక్రమంలో గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శనివారం పోలీసు పికెట్ ఏర్పాటుచేసినట్టు ఎస్ఐ వి.ఆంజనేయులు తెలిపారు. మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, ఇటీవల టీడీపీలో చేరిన మేదరమెట్ల కోదండరామయ్య వర్గీయుల మధ్య జరిగిన గొడవల నేపథ్యంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు పికెట్ ఏర్పాటుచేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మంత్రులకు సన్మానం

పామూరు, జూన్ 22: రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను శనివారం అమరావతిలోని మంత్రుల చాంబర్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రులను శాలువాలతో సత్కరించి కాణిపాకం వినాయక స్వామి వారి చిత్రపటాలను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

ఆదివారం 23 జూన్ 2024

- దైన్యస్థితిలో ఎన్నో డిగ్రీ కళాశాలలు
- గత ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో ఇక్కట్లు
- మేజర్, మైనర్ విధానంతో మరింత గందరగోళం

ప్రవేశాలకు.. ప్రతిబంధకాలు



గుంటూరులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

గుంటూరు(విద్య), జూన్ 22 : డిగ్రీ కళాశాలలు పలు కోర్సులతో వేల సంఖ్యలో విద్యార్థులతో కళకళలాడేవి. ఇంజనీరింగ్ తదితర ఎన్నో కోర్సులు వచ్చినా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు డిమాండ్ తగ్గేది కాదు. సామాజిక చైతన్య కేంద్రాలుగా డిగ్రీ కళాశాలలు విలసిల్లేవి. విద్యావేత్తలు, ప్రభుత్వాలు కూడా డిగ్రీ కళాశాలలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు డిగ్రీ కళాశాలల పాలిట శాపాల్లా మారాయి. ఒకప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఫలానా కాలేజీలో డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందడం అంటే ఓ ఘనతగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కారణంగా విద్యార్థుల ప్రవేశాలు సరిగా లేక ఆయా కళాశాలలు దైన్యస్థితికి చేరాయి. వందేళ్ల చరిత్ర ఉన్న పలు డిగ్రీ కళాశాలల్లో గతంలో బీఎస్సీ, బీకాం, బీఏ, బీబీఏ, బీసీఏ వంటి డిగ్రీ కోర్సులకు ఎంతో డిమాండ్ ఉండేది. ఫలితంగా విద్యార్థులతో కళకళలాడిన డిగ్రీ కళా శాలలు నేడు విద్యార్థుల లేక వెలవెలపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు, జాతీయ విద్యా విధానం పేరుతో తీసుకువచ్చిన అనేక సంస్కరణలు డిగ్రీ కళాశాలలకు గుదిబండగా మారడంతో ఈ దుస్థితి నెలకొందని అధ్యాపకులు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 20 వరకు ఎయిడెడ్ డిగ్రీ కళా శాలలు ఉండగా అరకొర అడ్మిషన్లతో నెట్టుకు వస్తున్నాయి. డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వడంలో కూడా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. దీంతో ఎక్కడా చేరలేక పోయిన వారు, సప్లమెంటరీ విద్యార్థులు మాత్రమే డిగ్రీ కళాశాలల్లో చేరుతున్నారు. మెరిట్ విద్యార్థులు ఇతర వర్సిటీలకు తరలిపోతున్నారు. గతంలో ఒక్కో కళాశాలలో సగటున వెయ్యి నుంచి 2 వేల మంది విద్యార్థులు ఉండేవారు. గతంలో ఇం టర్ ఫలితాలు రాగానే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యేవి. అయితే రెండేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది గందరగోళంగా మారడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఆ నోటిఫికేషన్ కూడా ఎప్పుడు వస్తుందో తెలియక గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నూతన విద్యా విధానంతో గందరగోళం

డిగ్రీలో నూతన విద్యావిధానం ప్రకారం మేజర్ మైనర్ కోర్సులంటూ ప్రవేశ పెట్టారు. ఉదాహరణకు బీఎస్సీ(గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ) తీసుకుంటే ఇందులో గణితం మేజర్ సబ్జెక్టుగా ఫిజిక్స్, కెమిస్ట్రీ మైనర్ సబ్జెక్టులుగా ప్రాధాన్యం లేని విధంగా ఉంటున్నాయి. మూడేళ్లలో గణితానికే అధిక ప్రాధాన్యం ఇస్తూ మైనర్ సబ్జెక్టుల గురించి పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఫలితంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు భారీగా గండి కొట్టినట్లు అవుతుందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాతపద్ధతిలో మూడు సబ్జెక్టులకు సమ ప్రాధాన్యం, సమానమైన మార్కులు ఉండేవి కొత్త విధానంలో అటువంటి పరిస్థితి లేదు.

వంరోవైపు ఇంటర్ సప్లిమెంటరీలో పాస్ అయిన వారికి అనేక కళాశాలల్లో సీట్లు రావడం లేదు.

డిగ్రీ కోర్సులకు ప్రభుత్వం సగటున రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తోండగా అది ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అనేక మంది విద్యార్థులకు ఫీజు రీయిం బర్స్‌మెంట్ సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో చివరి రెండు, మూడు సంవత్సరాల్లో విద్యార్థులు భారీ సంఖ్య లో డ్రాపవుట్స్ అవుతున్నారు. ఒకప్పుడు విద్యార్థినులతో కళకళాడిన గుంటూరులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సైతం అడ్మిషన్లకు ఇక్కట్లు వస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు గడుస్తున్నా ఇంకా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ రాలేదు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లోనా లేక ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేస్తారో తెలియక విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

జీవో 77తో పీజీ కోర్సులకు చెక్

డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఎక్కువ మంది పీజీ కోర్సుల వైపు దృష్టిసారిస్తారు. అయితే గత ప్రభుత్వం జీవో 77 తీసుకువచ్చి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదు. గతంలో పీజీ విద్యార్థులకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు రీయింబర్స్‌మెంట్ చెల్లించేవారు. జగన్ ప్రభుత్వం పీజీ కోర్సులకు రీయింబర్స్‌మెంట్ కట్ చేసింది. ఫలితంగా డిగ్రీ చదివిన అనేక మంది పీజీ కోర్సుల్లో చేరడం లేదు. కొద్దిగా డబ్బున్న కుటుంబాల విద్యార్థులకు మాత్రమే ప్రస్తుతం పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

త్వరలో లోకేశ్‌తో ఆక్టా భేటీ

ఉమ్మడి జిల్లాలో ఇటీవల ఆక్టా(అఫ్లియేటెడ్ కాలేజెస్ టీచర్స్ అసోసియేషన్) నాయకులు త్వరలో విద్యామంత్రి లోకేశ్‌తో భేటీ కావాలని నిర్ణయించారు. డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు, జీవో 77, మేజర్, మైనర్ కోర్సులు గురించి యువగళం పాదయాత్రలో లోకేశ్‌కు సంఘ నాయకులు వివరించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం గతంలో తమకు హామీ ఇచ్చిన లోకేశ్ విద్యాశాఖ మంత్రి కావడంతో ఆయన ఆయా అంశాలపై సానుకూలంగా స్పందిస్తారని, సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ఆక్టా నాయకులు, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మాలపాటి మోజేస్ ఆశాభావం వ్యక్తం చేశారు.



- గుంటూరుకు నాగలక్ష్మి
- బాపట్ల బాధ్యతలు జేసీ శ్రీధర్‌కు
- కర్నూలు జిల్లా కలెక్టర్‌గా రంజిత్‌బాషా
- జీఏడీలో రిపోర్టు చేయాలని వేణుగోపాల్‌రెడ్డికి ఆదేశం

కలెక్టర్లు బదిలీ

గుంటూరు, బాపట్ల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు యంత్రాంగం ప్రక్షాళన మొదలుపెట్టారు. శనివారం పలు జిల్లాల కలెక్టర్లను మార్చారు. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు, బాపట్ల కలెక్టర్లను బదిలీ చేశారు. గుంటూరు జిల్లా నూతన కలెక్టర్‌గా ఎస్ నాగలక్ష్మి నియమితులు కాగా బాపట్ల జిల్లా కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌కు అప్పగించారు. బాపట్ల జిల్లాకు నూతన కలెక్టర్ నియామకమయ్యే వరకు ఈయనే కలెక్టర్‌గా విధులు నిర్వహించనున్నారు

గుంటూరు కలెక్టర్‌గా ఉన్న వేణుగోపాలరెడ్డికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన్ను జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ఉన్న రంజిత్‌బాషాను కర్నూలు జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన నాగలక్ష్మి గతంలో గుంటూరు నగరపాలకసంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. శనివారం రాత్రి జరిగిన బదిలీల్లో విజయనగరం కలెక్టర్‌గా ఉన్న నాగలక్ష్మిని గుంటూరు కలెక్టర్‌గా మార్చారు. ఇంచుమించు రెండేళ్లకుపైగా గుంటూరు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన వేణుగోపాల్‌రెడ్డికి పోస్టింగ్ దక్కలేదు. ఆయన్ను ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగంలో పోస్టింగ్ కోసం రిపోర్టు చేయాల్సిందిగా చీఫ్ సెక్రెటరి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా వేణుగోపాల్‌రెడ్డికి పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీపై ఉద్యోగ వర్గాల్లో పలు విధాలుగా చర్చ జరుగుతున్నది. వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన సీనియర్ ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా జీఏడీలోనే రిపోర్టు చేయాలని గతవారం ప్రభుత్వం ఆదేశించింది. వారికి ఇంతవరకు ఎలాంటి పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో వేణుగోపాల్‌రెడ్డికి పోస్టింగ్ ఇవ్వకపోవడానికి కారణాలు ఉన్నాయన్న చర్చ కూడా జరుగుతున్నది. అమరావతి రాజధానిలో ఆర్ 5 జోన్‌ని వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు పెద్దల ఆదేశాల మేరకు కలెక్టర్ హోదాలో దీనికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి లే అవుట్లను ఏర్పాటు చేయించారు. అలానే సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాల మేరకు రాజధాని భూసేకరణ నోటిఫికేషన్లను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పోస్టింగ్ ఇవ్వకపోవడానికి ఇవి కారణమై ఉండొచ్చన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

గుంటూరుపై నాగలక్ష్మికి అవగాహన..

తమిళనాడు రాష్ట్రానికి చెందిన నాగలక్ష్మి సెల్వరాజన్ గుంటూరు నగరపాలకసంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సమయంలో మంచి పేరు తెచ్చుకున్నారు. విధి నిర్వహణల్లో ముక్కుసూటిగా వ్యవహరించేవారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గేవారు కాదు. ఎక్కడా అధికార దర్పం ప్రదర్శించే వారు కాదు. కృష్ణానది పుష్కరాల సమయంలో కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఆ సమయంలో గుంటూరు నగరంలోకి అప్రోచ్ రోడ్లు అయిన జీఎన్‌టీ, ఏటుకూరు, పొన్నూరు, మంగళగిరి, నందివెలుగు రహదారుల అభివృద్ధికి కృషి చేశారు. రోడ్లను వెడల్పు చేయించి సెంట్రల్ డివైడర్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు చాలావరకు పరిష్కరించారు. గుంటగ్రౌండ్ రోడ్డు, డొంకరోడ్డు విస్తరణ పనులు కూడా ఆమె హయాంలోనే జరిగాయి. కీలకమైన ఏఈఎల్‌సీ స్థలాన్ని రోడ్డు విస్తరణ కోసం సేకరించగలిగారు. నగర సుందరీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టబోయే కలెక్టర్‌కు జిల్లాపై అవగాహన ఉన్న దృష్ట్యా పరిపాలన సులభతరం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

గుంటూరుతో అనుబంధం ఎక్కువ

సివిల్ సర్వెంట్‌గా గుంటూరుతో తనకు అనుబంధం ఎక్కువని జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన ఎస్ నాగలక్ష్మి తెలిపారు. శనివారం రాత్రి ఆమె ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నగరపాలకసంస్థ కమి షనర్‌గా విధులు నిర్వహించిన జిల్లాకే కలెక్టర్‌గా నియామకం పొందడం సంతోషకరంగా ఉందన్నారు. కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ప్రజలు చూపిన ఆదరాభిమానాలు, ఉద్యోగులు, అధికారుల సహకారం మరువలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను ఆచరణలో పెట్టడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రతీ సోమవారం క్రమం తప్పకుండా గ్రీవెన్స్ రిడ్రెసల్ కార్యక్రమానికి హాజరై ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

టీడీపీ పార్లమెంటరీ పార్టీ లీడర్‌గా.. లావు



- ఉమ్మడి గుంటూరు జిల్లాకు పదవుల పంట
- ఇప్పటికే కేంద్రమంత్రిగా పెమ్మసాని
- రాష్ట్ర కేబినెట్‌లో ముగ్గురికి చోటు
- ధూళిపాళ్లకు ఖరారైన చీఫ్‌విప్ పోస్టు

గుంటూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతమైన ఉమ్మడి గుంటూరు జిల్లా పదవుల పంపకంలో అగ్రస్థానంలో నిలిచింది. కూటమిలో భాగంగా కేంద్ర కేబినెట్‌లో అనూహ్యంగా గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి తొలిసారి గెలిచిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సహాయ మంత్రిగా చోటు దక్కిన విషయం తెలిసిందే. ఇదే జిల్లా పరిధిలోని నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి రెండో పర్యాయం గెలుపొందిన విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ ప్రెసిడెంట్ లావు శ్రీకృష్ణదేవరాయులుకు కీలక పదవిని కట్టబెట్టేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఆయన్ను ఎన్నుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. త్వరలో జరిగే పార్లమెంటు సమావేశాల్లో నూతన ఎంపీల ప్రమాణ స్వీకారం అయిన తరువాత లావును పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకోనున్నారు. తాజా ఎన్నికలో గెలవడం ద్వారా లావు రెండో పర్యాయం లోక్‌సభలో అడుగు పెడుతున్నారు. గత ఎన్నికల్లో ఆయన వైసీపీ తరుపున గెలుపొందినప్పటికీ తన పంథాకు, విలువలకు భంగం కలగకుండా వ్యవహరించారు. వైసీపీ ప్రభుత్వం నుంచి తనకు ఎటువంటి సహకారం లభించనప్పటికీ నేరుగా కేంద్రమంత్రులతో పరిచయాలు పెట్టుకుని వారి సహకారంతో పల్నాడు ప్రాంతంలో అభివృద్ధి కోసం కృషి చేశారు. అయితే వైసీపీ భావజాలాలు ముఖ్యంగా ప్రత్యర్థుల పైనే కాకుండా వారి కుటుంబీకులను సైతం బూతులు తిట్టే సంప్రదాయం అదే పార్టీలో ఉన్న లావు జీర్ణించుకోలేకపోయారు. దీంతో ఆయన్ను పార్టీలో నుంచి పంపేందుకు పొమ్మనకుండా జగన్ పొగపెట్టాడు. సిట్టింగ్ ఎంపీగా ఉండి నియోజకవర్గ ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్న శ్రీకృష్ణదేవరాయలును అకారణంగా వలస పంపే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన వైసీపీలో కొనసాగను అని జగన్‌కు చెప్పి పార్టీకి రాజీనామా చేశారు. తదనంతరం టీడీపీ తరఫున నరసరావుపేట నుంచి పోటీ చేసే అవకాశం చంద్రబాబు కల్పించారు. రెండోసారి గెలుపొంది సీనియర్‌గా ఉండటమే కాకుండా పార్లమెంటులో గత ఐదేళ్లలో వివిధ అంశాలపై పలు మార్లు కూలంకషంగా చర్చించిన అనుభవాన్ని కూడా పరిగణలోకి తీసుకుని పార్లమెంటరీ పార్టీ నేతగా ఆయన్ను నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే రాష్ట్ర కేబినెట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎంపికైన ముగ్గురుకి చోటు దక్కటమే కాకుండా కీలకశాఖలు కూడా లభించాయి. అంతే కాకుండా పొన్నూరు నుంచి ఆరోసారి విజయం సాధించిన టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు కూడా చీఫ్‌విప్ పదవిని కట్టబెట్టేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. రెండు, మూడు రోజుల్లో ఆయన నియామకాన్ని కూడా ప్రకటిస్తారు. కాగా అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ కీలక పదవులు లభించటంతో రాజధాని ప్రాంత వాసులు, ముఖ్యంగా అమరావతి కోసం భూములను త్యాగం చేసిన రైతులు సంబర పడిపోతున్నారు.

విద్యుత్ మంత్రిగా గొట్టిపాటి

- బాధ్యతలు స్వీకరించిన రవికుమార్
- వ్యవసాయ కనెక్షన్ల మంజూరుపై తొలి సంతకం
- దేశంలోనే ఆదర్శవంతమైన శాఖగా తీర్చిదిద్దుతామన్న మంత్రి

అద్దంకి, జూన్ 22: అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం మధ్యాహ్నం వెలగపూడి సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అద్దంకి నుంచి ఐదో సారి వరుస విజయాలతో రికార్డు సృష్టించిన గొట్టిపాటి రవికుమార్‌ను ఇటీవల చంద్రబాబు తన క్యాబినెట్‌లోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గొట్టిపాటి ఆ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖకు సంబంధించి మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో కొత్తగా 40,336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరుపై మంత్రిగా గొట్టిపాటి తొలి సంతకరం చేశారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల్లో దశల వారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికీ 3 కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించే ఫైల్స్‌పై కూడా సంతకాలు చేశారు. విద్యుత్ డిమాండ్, సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తానని మంత్రి తెలిపారు. దేశంలో విద్యుత్ సంస్కరణలకు ఆద్యుడు చంద్రబాబునాయుడు అన్నారు. దేశంలో ఉత్తమ విద్యుత్ శాఖగా రాష్ట్ర విద్యుత్ శాఖను తీర్చిదిద్దుతామన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా పని చేయాలని సూచించారు. గత ప్రభుత్వం విద్యుత్‌శాఖను నిర్వీర్యం చేయడమే కాకుండా 9 సార్లు చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారంమోపిందన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న గొట్టిపాటి రవికుమార్

పలువురు అభినందన

విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, భాష్యం ప్రవీణ్, జీవీ ఆంజనేయులు, చింతమనేని ప్రభాకర్, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆదిరెడ్డి శ్రీనివాస్, కూన రవికుమార్ తదితరులు కలిసి అభినందించారు.

నకిలీలపై.. నిర్లక్ష్యం



విత్తనంపై.. పంట ఎదుగుదల, దిగుబడితో పాటు రైతన్న జీవితం ఆధారపడి ఉంటుంది. మంచి విత్తనం అయితే అధిక దిగుబడితో రైతు లబ్ధి పొందతాడు. అదే నకిలీదైతే పంట పండక రైతు ఆర్థికంగా చితికిపోయి అప్పుల పాలవుతాడు. కొందరైతే తనువు కూడా చాలిస్తాడు. ఇంతటి ప్రాధాన్యమైన విత్తనం విషయంలో కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతుండగా వారికి కొందరు అధికారులు సహకరిస్తున్నారు. దీంతో మార్కెట్‌ను నకిలీ విత్తనాలు ముంచెత్తుతున్నాయి.

- విత్తన వ్యాపారులపై 6 ఏ కేసుతో సరి
- రైతులు నట్టేట మునిగినా కంటితుడుపు చర్యలే
- చిన్న కేసులేనని రెచ్చిపోతున్న అక్రమ వ్యాపారులు

గుంటూరు సిటీ, జూన్ 22: రైతుల జీవితాలతో ఆడుకునే నకిలీ విత్తనాల వ్యాపారులను కట్టడి చేసే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నకిలీ విత్తన వ్యాపారులపై కఠినమైన చర్యలు చేపట్టడంలేదు. వ్యాపారులు నకిలీ విత్తనాలతో రైతులను నట్టేట ముంచినా వారిపై కేవలం 6 ఏ కేసులతో సరి పెడుతున్నారు. ఎన్ని నకిలీ విత్తనాలు విక్రయించినా, ఎన్ని సార్లు పట్టుబడినా.. పెట్టేది ఆ చిన్న కేసు మాత్రమే కావడంతో కొందరు అక్రమ వ్యాపారులు రెచ్చిపోతున్నారన్న వాదన వినిపిస్తోంది.

ఎక్కడైనా అదే.. ఎవరైనా అదే

గత నెలలో గుంటూరు ఏటుకూరురోడ్డులోని సింధూరి సీడ్స్‌లో నకిలీ మిరప విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలో ప్యాక్ చేసి అమ్మాల్సిన విత్తనాలను ఇక్కడ ప్యాక్ చేస్తుండగా స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. రాజాగారి తోటలో కూడా శారదా పరమేశ్వరి సీడ్స్ నుంచి కాలం చెల్లిన 14.25 కేజీల విత్తనాలు వ్యవసాయ శాఖ అధికారులు పట్టుకున్నారు. అక్క డా అదే కేసు నమోదు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరికొన్ని చోట్ల ఇదే రీతిలో విజిలెన్స్ అధికారులు నకిలీ విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయితే వారి పై పస లేని 6ఏ కేసు మాత్రమే పెట్టారు. అంటే రైతు నిండా మునిగే విత్తనం విషయంలో అధికారులు ఎంతటి నిర్లక్ష్యంగా ఉన్నారో తెలుసుకోవచ్చు.

పోయేది ఏమీ లేదు...

ది ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ 1955లోని సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేయటం వల్ల పెద్దగా జరిగే నష్టం ఏమీ ఉండదు. ఈ చట్ట ప్రకారం విత్తనాలను సీజ్ చేస్తారు. విచారణ తర్వాత మహా అయితే రూ.500 జరిమానా, 5 నెలలు జైలు శిక్ష మాత్రమే పడుతుంది. కొన్ని సందర్భాల్లో సీజ్ చేసిన వాటిని జప్తు చేస్తారు. ఇటువంటి బలహీనమైన కేసు వల్ల నకిలీ విత్తనాలు వ్యాపారులు నేరం మళ్లీ మళ్లీ చేసేందుకు వెనుకాడటం లేదు. విజిలెన్స్ రికార్డుల ప్రకారం చూస్తే నకిలీ విత్తనాలు పదే పదే పాత వారి వద్దే దొరుకుతున్నట్లు అర్థమవుతుంది. ఒక ఏడాది భాగస్వాములు మారినా మళ్లీ అక్కడే నకిలీ విత్తనాలు పట్టుపడుతూ ఉండటం గమనార్హం. 6ఏ కేసు వల్లే కొందరు వ్యాపారులు ఏ విధమైన అనుమతి లేకుండా పక్క రాష్ట్రాల నుంచి తీసుకుని వచ్చి నిర్భయంగా అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

మిగిలిన శాఖల సహకారం కరువే..

నకిలీ విత్తనాల కేసుల విషయంలో పోలీసు శాఖ సహకారం కరువైనట్లు కనిపిస్తుంది. విత్తనాలు పట్టుకున్న తర్వాత కేసు నమోదు చేయడానికి వ్యవసాయ శాఖ పోలీసు స్టేషన్‌లో తప్పస్సు చేయాల్సి వస్తుంది. కేసు నమోదు నుంచి కోర్టుకు వెళ్లే వరకు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వ్యవసాయ అధికారులు ఆవేదన చెందుతున్నారు. ఆ తర్వాత కూడా కేసు నిరూపణ కొరకు ఇబ్బందులు ఎదురైనా నకిలీ విత్తనాల వ్యాపారులకు శిక్ష పడేలా చేస్తున్నామని అంటున్నారు. మిగిలిన శాఖల సమన్వయం, సహకారం ఉంటే నకిలీ విత్తనాలు వ్యాపారుల ఆట కట్టించటం పెద్ద సమస్య కాదనేది కొందరి అభిప్రాయం.

అప్పట్లో వణుకు...

కాంతిలాల్ దండే ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ గా ఉన్నప్పుడు నకిలీ విత్తనాల వ్యాపారులపై ఉక్కుపాదం మోపారు. అప్పట్లో పదే పదే నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుపడిన వారిపై, కొన్ని కంపెనీలపై పీడీ యాక్టు పెట్టించారు. అటువంటి కఠిన చర్యలు ఉండటం వల్ల చాలామంది అప్పట్లో నకిలీల వైపు చూసేందుకు భయపడ్డారు. ఈ కేసులో బెయిల్ కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో పక్క రాష్ట్రాల నుంచి విత్తనాలు తెచ్చి అమ్మే సాహసం వ్యాపారులు చెయ్యలేదు.

కార్పొరేషన్‌లో పని దొంగలు!



- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు
- చీపురు పట్టరు.. చెత్త ఎత్తరు
- వేలల్లో మాత్రం వేతనాలు తీసుకుంటారు
- ప్రభుత్వం మారినా నేటికీ కొనసాగుతున్నారు
- కొందరు కార్పొరేటర్ల ఆదేశాలతో ఆర్డరు లేకుండానే అటెండర్లుగా పనులు
- ఏరివేత దిశగా అధికారులు చర్యలేవీ?

ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో గత ఐదేళ్లుగా వైసీపీ నేతలు స్వైరవిహారం చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆప్కాస్ పేరుతో ఇష్టారాజ్యంగా తమ పార్టీ కార్యకర్తలకు ఉద్యోగాలు కట్టబెట్టారు. పేరుకు శానిటరీ వర్కర్‌గా పేరు నమోదు చేసి, వైసీపీ కోసం వారి సేవలను వినియోగించుకున్నారు. ఇది లా ఉంచితే ఎలాంటి ఆర్డర్లు లేకుండానే తమకు అనుకూలమైన వారిని అటెండర్లు, మేస్త్రీలుగా, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ వర్కర్లుగా నియమించారు. గత ఐదేళ్లలో వందల సంఖ్యలో పోస్టులను యథేచ్ఛగా ఇచ్చేయడంతోపాటు, వేతనంగా ప్రభుత్వ సొమ్మును భారీగా చెల్లించారు. దీంతో కార్పొరేషన్ ఖజానాకు భారీగానే గండిపడింది. కాగా ప్రభుత్వం మారినా వారిలో ఎటువంటి మార్పు లేదు. పైగా కార్యాలయం ఎప్పటికీ తమ అడ్డానే అన్న విధంగా ప్రవర్తించడం కొసమెరుపు.

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 22: అధికారం మాదే. అడిగేవారు లేరంటూ ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ నేతలు రెచ్చిపోయారు. ఇష్టారాజ్యంగా తమ వారికి పోస్టులు పంచుకున్నారు. అధికారులను, సిబ్బందిని సైతం బెదిరించి మరీ పనులు చేయించుకున్నారు. అధికారులు కూడా చేసేదేమీ లేక వైసీపీ నేతల ఆదేశాలకు జీహుజూర్ అనడంతో పాటు పనిలోపనిగా తమ జేబులు నింపుకొన్నారు. అటు వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు పాలించగా, ఒంగోలు పాలకవర్గం ఏర్పాటు అయి మూడేళ్లు దాటింది. దీంతో పాలన వైసీపీ కార్పొరేటర్ల చేతిలోకి వెళ్లిపోగా, తమకు ఇష్టమైన వారికి కాంట్రాక్టు పోస్టులు కట్టబెట్టడం, తమ ఇళ్లలోనూ, పెద్ద నేతల పనులకు వినియోగించుకున్నారు. విధుల్లో రావాలని మున్సిపల్ అధికారులు అడిగితే అన్నకు చెప్పండి అని అనడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం మారినా ఇప్పటికీ అదే తంతు నడవడం గమనార్హం.

పాలన మారినా మారని తీరు..

తాజాగా జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి బాగా గుణపాఠం చెప్పారు. తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారు. ప్రభుత్వం మారింది పాలకులు మారారు కానీ కార్పొరేషన్‌లో వైసీపీ కార్పొరేటర్ల పెత్తనం మాత్రం అలాగే కొనసాగుతోంది. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆ పార్టీ కార్యాకర్తలకు ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు ఇవ్వగా నేటికి వారు కార్పొరేటర్లకు అనుచరులుగానే తిరుగుతున్నారు. పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారు. పారిశుధ్య విభాగంలో, ఇంజనీరింగ్ విభాగాలలో కొందరు వైసీపీ కార్యకర్తలకు పోస్టులు ఇవ్వగా, నేటికి ఒక్కరోజు కూడా వారు కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. అయితే అధికారులు సైతం వారికి పనిచెప్పడానికి వెనుకాడటం వెనుక ఆంతర్యం ఏమిటనే అనుమానాలు అందరిలోనూ వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా కొందరు అధికారులు తమ వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉంది. పారిశుధ్య కార్మికులుగా చేరి కార్పొరేషన్‌లో పెత్తనం చేస్తున్న వారందరితో చీపుర్లు పట్టించి నగరంలో ఊడ్పిస్తే అసలు బండారం బయటపడటం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇంకా వైసీపీ కార్పొరేటర్ల కనుసన్నల్లోనే పనిచేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

150 మందికి పైగా ఉద్యోగాలు.. రూ. వేలల్లో జీతాలు

బాలినేని శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన అనుచరుల కోసం, అలాగే పార్టీ కార్యకర్తల కోసం ఇష్టారాజ్యంగా ఉద్యోగాలకు సిఫారసు చేశారు. ఆప్కాస్ కింద 56 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. శానిటరీ విభాగం, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వీరికి నెలనెలా రూ.21వేల వేతనం చెల్లిస్తున్నారు. మరోవైపు కొవిడ్ సిబ్బంది కింద మరో 100 మందికిపైగా ఉద్యోగాలు ఇవ్వగా వీరికి నెలకు రూ.18వేలు చెల్లిస్తున్నారు. అయితే వీరిలో ఇరవై, ముప్పై మంది మాత్రం ఉద్యోగాలకు వెళుతుండగా, మిగిలిన వారు మాత్రం కార్పొరేటర్ల సేవలో కొనసాగుతున్నారు. ఒక్కో కార్పొరేటర్ వద్ద కనీసం ముగ్గురు, నలుగురు సేవలు అందిస్తుండగా, వారికి ఆప్కాస్ కింద, కార్పొరేషన్ నిధుల నుంచి టంచన్‌గా జీతాలు చెల్లిస్తున్నారు. అయితే నిన్న, మొన్నటివరకు అధికారంలో వైసీపీ ఉండగా, అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించారు.

ముగ్గురు ఉద్యోగులు.. వారికి ముగ్గురు అటెండర్లు

ప్రభుత్వం మారినా వైసీపీ కార్పొరేటర్ల మాత్రం వెనక్కుతగ్గడం లేదు. తమ మనుషులతో పనిచేయించడానికి వీలు లేదంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. సుమారు 19 మంది పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ పనులకు పోకుండా కార్పొరేషన్ కార్యాలయంలో తిరుగుతుండడంపై అటు అధికారులు, ఇటు ఇతర సిబ్బంది పెదవి విరుస్తున్నారు. గతంలో పారిశధ్య కార్మికులుగా పని చేసిన వారు తమ పలుకుబడి, కార్పొరేటర్ల ఆశీస్సులతో కార్యాలయంలో అటెండర్లుగా కొనసాగుతున్నారు. అయితే అధికారపూర్వకంగా వీరికి ఎలాంటి ఆర్డరు కాపీ లేకపోయినా, ఆయా సెక్షన్‌లలో హల్‌చల్ చేయడంపై ఇతర రెగ్యులర్ ఉద్యోగులు మండిపడుతున్నారు. ముఖ్యంగా అకౌంట్ సెక్షన్‌లో ముగ్గురు ఉద్యోగులు ఉండగా, వారికి ఒకొక్కరికి ఒక్కో అటెండర్ ఉండటం చూస్తుంటే వైసీపీ కార్పొరేటర్ల పెత్తనం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పేరుకు పారిశుధ్య కార్మికులుగా విధుల్లోకి చేరిన వారు చీపురు పట్టడానికి ఇష్టపడరు. పనిచేయడానికి ముందుకు రారు అనే మాట అధికారుల వైపు నుంచి వినిపిస్తోంది. ఇంకోవైపు నగరంలో పారిశుధ్య సమస్య వేధిస్తుండగా, అందుకు అనుగుణంగా కార్మికులు లేరు. వైసీపీ అండదండలతో పలు సెక్షన్‌లలో పెత్తనం చేస్తున్న 19మంది కార్మికులను తిరిగి చెత్త సేకరణకు పంపాల్సి ఉంది. అలాగే ఆప్కాస్ కింద ఉద్యోగాలు పొంది, కార్యాలయానికి రాని వారిని తొలగించాల్సిన అవసరం ఉందనే అధికారులే చెబుతున్నారు. ప్రజలకు మెరుగైన, పారదర్శక పాలన కోసం అధికారులు కృషిచేయాలని, ఐదేళ్లుగా పనిచేయకుండా ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకున్న వారి నుంచి రికవరీలు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

త్వరలో ప్రక్షాళన చేస్తాం

- ఎం. జశ్వంత్‌రావు, నగర కమిషనర్

పనిచేయని కార్మికుల తొలగింపు చర్యలు చేపట్టాం. ఎక్కడా లేనివిధంగా ఒంగోలులోనే మేస్త్రీల వ్యవస్థ ఎక్కువగా ఉంది. పేరుకు 140 మంది మేస్త్రీలు ఉన్నారు. కానీ వాస్తవంగా విధుల్లో కనిపించేవారు అతి తక్కువ మంది. అటువంటి వారిని గుర్తించాం. ప్రతిరోజు మస్టర్‌కి వచ్చేవారు మాత్రమే పనిచేస్తారు. పనిచేయని వారిని ఉపేక్షించేది లేదు. అలాగే కార్యాలయంలోనూ ఆర్డరు కాపీ లేకుండా అటెండర్లుగా ఉన్నవారిని గుర్తించి, గతంలో వారు కొనసాగిన పనిలోకి పంపుతాము. ఇకపై శానిటరీ సెక్రటరీలు కూడా ఖచ్చితంగా తెల్లవారుజామున విధుల్లో ఉండాల్సిందే. ఇప్పటికే సెక్రటరీలకు హెచ్చరికలు జారీ చేశాం. 71మంది శానిటరీ సెక్రటరీలు రోజు పారిశుధ్య పనులు పర్యవేక్షించాల్సిందే. నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు వేగవంతం చేశాం. అందుకు అనుగుణంగా త్వరలోనే ప్రక్షాళన చేసి. సమస్యలన్నీ పరిష్కరిస్తాం.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

యడ్లపాడు, జూన్ 22: జాతీయరహదారిపై యడ్లపాడు నక్కవాగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన కోటగిరి రాజ(25) ఈ నెల 4న గుంటూరులోని ఓ ప్రైవేటు ఇఎన్‌టి ఆసుపత్రిలో చికిత్స పొందాడు. చెకప్ నిమిత్తం తిరిగి శనివారం ద్విచక్రవాహనంపై ద్రోణాదుల నుంచి గుంటూరులోని గుంటగ్రౌండ్ సమీపంలో గల ఈఎన్‌టి ఆసుపత్రికి వచ్చాడు. పరీక్షల అనంతరం తిరిగి సాయంత్రం గ్రామానికి బయలుదేరాడు. యడ్లపాడు నక్కవాగు సమీపంలోకి రాగానే అదే మార్గంలో వెళుతున్న కారు గేదెల్ని తప్పించేక్రమంలో ప్రక్కకు రావడంతో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రాజ కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్ళిపోగా కారు నంబరు ప్లేట్ అక్కడే ఊడి రోడ్డుపై పడింది. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన యువకుడిని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రాజ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సంఘటనాస్థలంలో పడిఉన్న కారు నంబరు ప్లేటును స్వాధీనం చేసుకున్న పోలీసులు దెబ్బతిన్న ద్విచక్రవాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనోధైర్యంతో నిలవాలి .. అండగా ఉంటాం

చీరాల, జూన్ 22: జరిగిన సంఘటన బాధాకరం. పూడ్చలేనిది. మనోధైర్యంతో నిలివాలి. అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి హత్యాచారం జరిగిన యువతి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చీరాల మండలం ఈపురుపాలెంలో శుక్రవారం జరిగిన యువతి రేప్, హత్యకు సంబంధించి శనివారం బలరాం ఇతర నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు ఘటన జరిగిన తీరును బలరాంకు వివరించారు. అనంతరం ఆయన మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్థానికంగా జరిగిన ఘటనకు సంబంధించి గంజాయి వాడకందార్ల హస్తం ఉందా అనే కోణంలో ఆరా తీశారు. డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌తో మాట్లాడారు. నిందితులను ఎవరిని వదలొద్దని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు,జూన్ 22: ఇంకొల్లులో శనివారం నేత్రదానం జరిగింది.గ్రామానికి చెందిన నార్నె అరుణ(53) మృతి చెందగా ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ కంటి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానంకు సహకరించిన మృతురాలి కుటుంబసభ్యులను రోటరీ క్లబ్ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, ట్రెజరర్ చుండి సాంబశివరావు, అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు ,క్లబ్ సభ్యులు అభినందించారు.

హత్యాయత్నం ఘటనలో 33 మందిపై కేసు

అద్దంకి, జూన్ 22: హత్యాయత్నం సంఘటనకు సంబంధించి 33 మందిపై అద్దంకి పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు ముండ్లమూరు మండలం శంకరాపురంకు చెందిన రెండు వర్గాలకు చెందిన వ్యక్తుల మధ్య వివాదం చోటు చేసుకొని చివరకు ఓ వర్గం మూకుమ్మడిగా శుక్రవారం రాత్రి మరో వర్గంపై దాడి చేయటంతో ఐదుగురుకి గాయాలు అయ్యాయి.

తిమ్మాయపాలెం సమీపంలోని ఇటుకబట్టీల వద్ద మం దలపు శివకృష్ణతో పాటు మరో నలుగురిపై అదే గ్రామానికి చెందిన మందలపు వెంకటరావుతో పాటు మరో 32 మంది మూకుమ్మడిగా దాడి చేయటం తో గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఒంగోలు వైద్యశాలకు తరలించారు. శివకృష్ణ ఫిర్యాదు మేరకు 33 మందిపై కేసు నమోదు చేసినట్లు మహిళా ఎస్సై రత్నకుమారి తెలిపారు.

కొత్త కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా

- అల్లూరి జిల్లాకు దినేష్‌కుమార్ బదిలీ



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎ.తమీమ్ అన్సారియా నియమితులయ్యారు. ఆమేరకు శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్సారియాకు కలెక్టర్‌గా ఇదే తొలి పోస్టింగ్. గతంలో ఆమె ఆయా మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా పనిచేశారు. ప్రస్తుతం శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన తమీమ్ అన్సారియా కేరళ రాష్ట్రానికి చెందిన వారని తెలిసింది. ఆమెతోపాటు భర్త కూడా ఐఏఎస్ అధికారి. ఇద్దరూ ఏపీకి కేటాయించబడ్డారు. ప్రస్తుతం ఆమె భర్త శ్రీకాకుళం కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన్ను బదిలీ చేయ లేదని తెలిసింది. ఎన్నికలకు కొద్దికాలం ముందుగానే అన్సారియా శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం అన్సారియాను మన జిల్లాకు 38వ కలెక్టర్‌గా నియమించారు. నిబంధనలకు అనుగుణంగా పనిచేసుకెళ్లే అధికారిగా ఆమెకు పేరుంది. మితభాషి అని కూడా చెప్తున్నారు. ఇప్పటివరకూ కలెక్టర్‌గా ఉన్న దినేష్‌కుమార్‌ను గిరిజన ప్రాంతాలతో ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. తమిళనాడుకు చెందిన దినేష్‌కుమార్‌కు కూడా కలెక్టర్‌గా ఒంగోలులో తొలి పోస్టింగ్ ఇవ్వగా రెండేళ్లు పనిచేశారు. అధికారపార్టీ నేతలతో సమన్వయంగా పనిచేయడంలో సఫలీకృతులయ్యారు. ఒకదశలో ఆయనకు మళ్లీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇవ్వకపోవచ్చని భావించారు. కానీ వివిధ కోణాల్లో పరిశీలించిన అనంతరం ఆయన్ను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా నియమించినట్లు తెలిసింది.

ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఒంగోలు(కల్చరల్), జూన్ 22: రాష్ట్రంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.కోటేశ్వరరావు, జి.రవికిషోర్ డిమాండ్ చేశారు. నెల్లూరు డివిజన్ కమిటీ సమావేశం శనివారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రవికిషోర్ మాట్లాడుతూ కేరళలో సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి ఏజెంట్లకు పెన్షన్ సౌకర్యం, వారి పిల్లలకు స్కాలర్‌షిప్ వసతి కల్పిస్తున్నారన్నారు. అలాగే మన రాష్ట్రంలో కూడా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, 65 సంవత్సరాల పరిమితి ఎత్తి వేయాలని ఆయన చెప్పారు. గ్రాట్యుటీపై ఉన్న సీలింగ్ ఎత్తివేసి, గ్రాట్యుటీ లెక్కింపు విధానాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్, నెల్లూరు డివిజన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బెజవాడ శివయ్య, సీహెచ్.నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకట్రావు, నాయకులు ధనుంజయ, కె.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, కె.బాలచంద్రం, కె.రామకోటిరెడ్డి, సుబ్బారెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, ఎన్.బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా ఆగిన రైతుబజార్ పనులు

- బిల్లుల కోసం బీజేపీ నేతల ద్వారా ప్రయత్నాలు



నిలిచిపోయిన రైతు బజార్ నిర్మాణ పనులు

దర్శి, జూన్ 22: దర్శి - కురిచేడులో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న రైతుబజార్ వైసీపీ పాలకల నిర్లక్ష్యంతో మధ్యలో నిలిచిపోయింది. కూరగాయలు పండించే రైతులు మార్కెటింగ్ చేసుకునేందుకు వీలుగా ఏడాది క్రితం రైతు బజార్ నిర్మాణం చేపట్టారు. మార్కెటింగ్ శాఖ నిధులు రూ.80 లక్షలు మంజూరుకాగా, రూ.60 లక్షల పనులకు టెండర్లు పిలిచారు. ఓ వైసీపీ నాయకుడు నిర్మాణ పనులు చేపట్టాడు. పనుల ఆరంభం నుంచి నాసిరకం మెటీరియల్‌తో పనులు చేస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. ఏదోరకంగా చేతులు దులుపుకోవాలన్న ఉద్దేశంతో కొంతమేర పనులు చేసి మొదటిబిల్లు రూ.25 లక్షలకు అధికారులు పంపించారు. వైసీపీ ప్రభుత్వం నిధుల కొరతతో బిల్లులు విడుదల చేయలేదు. అనంతర ఎన్నికల కోడ్ రావటంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. షాపులకు గోడలు నిర్మించారే కాని కొన్నింటికి శ్లాబులు కూడా వేయలేదు, పునాదులకు అరకొరగా మట్టి తోలడంతో నెర్రెలు ఇచ్చాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆ వైసీపీ నాయకుని నోట్లో వెలక్కాయ పడినట్లయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆ నాయకుడు భూఆక్రమణలకు కొంతమందిని పురమాయించటం, అడ్డగోలు పంచాయితీలు చేసి అనేక అక్రమాలకు పాల్పడ్డాడు. టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో బిల్లుల కోసం ప్రత్నామ్నాయ దారులు వెతుకుతున్నట్లు తెలసింది.

రైతుబజార్ బిల్లుల విడుదల కోసం సదరు వైసీపీ నాయకుడు ఓ బీజేపీ నాయకుని ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. టీడీపీ నియోజకర్గ నాయకులను ఓ బీజేపీ నేత కలిసి ఆపనులకు తాను పెట్టుబడి పెట్టానని, బిల్లులు విడుదల చేయించాలని కోరినట్లు తెలిసింది. అందుకు ఆటీడీపీ నాయకులు సమ్మతించకుండా ఆలోచించి నిర్ణయం తీసుకుందామని చెప్పినట్లు తెలుస్తుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక శాఖల్లో తూతూమంత్రంగా పనులు చేశారు. అనేక మందికి ఎన్నికలకోడ్‌తో బిల్లులు రాలేదు. టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో బిల్లులను నిలిపివేయాలని నిర్ణయించటంతో మరికొంత మంది వైసీపీ నాయకులు కూడా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. గతంలో ఉన్న పరిచయాలను దృష్టిలో ఉంచుకొని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి వద్దకు వెళుతున్నట్లు సమారం. అయితే, ఆయన నియోజకవర్గ టీడీపీ నాయలకులతో సంప్రదించకుండా ఎలాంటి పనులు చేయటం లేదు. దీంతో వైసీపీ నాయకులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

ఉద్యోగం పేరుతో టోకరా

- యువతిని మోసగించిన ఘరానా మోసగాడు
- రూ. 5.36 లక్షలు లాగేసిన వైనం
- స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

కారంచేడు(పర్చూరు), జూన్ 22: ఉద్యోగం పేరుతో నిరుద్యోగ యువతపై చేస్తున్న ఘరానా మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. ఘరానా మోసగాళ్లు ఇదిగో ఉద్యోగం.. అదిగో ఉద్యోగం అంటూ యువతను మోసం చేసి లక్షల రూపాయల నగదుతో అదృశ్యమౌతున్నారు. ఇలాంటి మోసం శనివారం కారంచేడు మండలంలో యువతి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది.

కారంచేడుకు చెందిన ఒక నిరుద్యోగికి వాట్సాప్ లింక్‌ల ద్వారా వచ్చిన మెసేజ్‌తో నమ్మబలికించి రూ.5.39 లక్షలను కట్టించుకొన్నారు. తరువాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి గ్రూపు డిలీట్ చేయటంతో మోసపోయానని గుర్తించారు. దీంతో యువతి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సురేష్ బాబు అందించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన జాగర్లమూడి లక్ష్మీన్నారాయణ కుమార్తె ఆలేఖ్య ఉద్యోగ ప్రయాత్నాలు చేస్తున్నారు.

ఇటీవల ఒక వాట్సాఫ్ గ్రూపునకు తన మొబైల్ నెంబర్ యాడ్ అయిఉంది. గ్రూప్‌లో వర్క్‌ఫం హోమ్ ఉండటంతో తనకు ఉద్యోగం వస్తుందన్న ఆశతో వాట్సాప్ గ్రూపు ద్వారా వారు అడిగిన వివరాలకు సమాచారం అందించింది. వారు ఇచ్చిన లింకులోని సమాచారంతో పాటు అకౌంట్ నెంబర్‌కు దశల వారీగా నగదును చెల్లించింది. డబ్బుతీసుకున్న అనంతరం గ్రూపు డిలీట్ కావటంతో మోసపోయానని గుర్తించిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బడి బస్సుల తనిఖీ

- కొరడా ఝుళిపించిన రవాణా శాఖ
- 8 స్కూలు బస్సులపై కేసులు నమోదు



బడి బస్సును తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

ఒంగోలు(క్రైం), జూన్ 22: రవాణా శాఖ ఎట్టకేలకు కదిలింది. బడి బస్సులపై కొరడా ఝుళిపించిది. పాఠశాలలు ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా ఇప్పటికి 50శాతం మాత్రమే బస్సులు ఫిట్‌నెస్ పరీక్ష చేయించడంపై రవాణా శాఖ అధికారులు కన్నెర్ర చేశారు. శనివారం ఉదయం స్థానిక మంగమూరురోడ్డు జంక్షన్‌తో పాటు జిల్లాలో వివిధ ప్రాంతాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ లేకుండా ఉన్న బస్‌లతో పాటుగా లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. రూ.1,03,600 జరిమానా విధించారు. జిల్లావ్యాప్తంగా 74 బస్‌లు తనిఖీలు చేశారు. 12 బస్‌లపై కేసులు నమోదు చేశారు. ఒంగోలులో ఎనిమిది, ఇతర ప్రాంతాలలో నాలుగు బస్‌లపై కేసులు నమోదు చేశారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని ఈసందర్బంగా రవాణాశాఖ అధికారులు హెచ్చరించారు. తనిఖీలలో మార్కాపురం ఆర్టీఓ అమరనాయక్, ఎంవీఐలు ఏ.మాధవరావు, ఏ.కిరణ్ ప్రభాకర్, కే.రామచంద్రరావు, ఎల్.సురేంద్రప్రసాద్, రవినాయక్, కె.జయప్రకాష్‌లు పాల్గొన్నారు.

తనిఖీలు నిరంతరం చేస్తాం: డీటీసీ

ఫిట్‌నెస్ లేకుండా బస్‌లు రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్. సుశీల తెలిపారు. ఇప్పటివరకు జల్లాలో 21 బస్‌లపై కేసులు నమోదు చేశామని సుమారు రూ.2.5 లక్షలకుపైగా జరిమానా విధించినట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యం తప్పనిసరిగా బస్‌లకు ఫిట్‌నెస్ చేయించుకోవాలని ఆదేశించారు.

నాగరాజుపల్లిలో టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ

మార్టూరు, జూన్ 22: మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. గ్రామంలో టీడీపీ మద్దతుదారుడైన మక్కెన వెంకటరమణ అనే వ్యక్తి ఇంటిపైకి వైసీపీకి చెందిన జడా వెంకటేశ్వర్లు, ఆయన భార్య కుమారుడు మరో వ్యక్తితో కలిసి వెళ్లారు. ఈనేపథ్యంలో జడా వెంకటేశ్వర్లుకు చెందిన వ్యక్తులకు, టీడీపీకి చెందిన వెంకటరమణ, తదితర వ్యక్తుల మధ్య వాదన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో జడా వెంకటేశ్వర్లుకు, అతని భార్య, కుమారుడు ప్రసాద్‌లకు గాయాలయ్యాయి. సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అందరినీ చెదరగొట్టి ఎలాంటి గొడవలు జరగకుండా పర్యవేక్షించారు. బాధితులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఇరు పార్టీలకు చెందిన వారు స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.సీఐ రాజశేఖర్‌రెడ్డి గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఏఎస్ఐ బాషా తదితర సిబ్బందితో తో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ జరిగిన రోజు ఒక ఓటు విషయంపై జరిగిన వివాదం ఈ గొడవకు కారణమయినట్లు సమాచారం.

పథకాలకు సొంత పేర్లతో భ్రష్టు పట్టించారు

వైసీపీ ప్రభుత్వంపై దళితుల మండిపాటు

టీడీపీ, జనసేన నేతలకు పాలభిషేకం



ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, డోలా చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న నేతలు

పర్చూరు, జూన్ 22: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలకు జగన్ పేరు పెట్టుకొని భ్రష్టు పట్టించారని తెలుగుదేశం, జనసేన నేతలు మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉన్న అంబేడ్కర్ విదేశీ విద్య పేరును తొలగించి జగనన్న విదేశీ విద్య పథకంగా మార్చి భాతర రాజ్యాంగ పితామహుడు అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచారన్నారు. నూతనంగా ఏర్పాటు అయిన ప్రజా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెనువెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆ పథకానికి జగన్ పేరు తొలగించి అంబేడ్కర్ పేరును పెడుతూ అమలుకు ఉత్వర్వులు జారీ చేశారన్నారు. దీనిపై స్పందించిన స్థానిక నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చిత్రపటాలకు శనివారం పాలభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కంభంపాటి మార్కు, వడ్డెముక్కల అబ్రహాం, నలిగిల కిషోర్, సాల్మన్, గద్దె రాంలక్ష్మణ్, సుధాకర్, అజయ్, గేరా శ్యామ్, స్థానిక నేతలు కఠారి సురేంద్రబాబు, కారంపూడి సందీప్ తేజ, తులసి శ్రీనివాసరావు, అగ్నిగుండాల వెంకటకృష్ణ, రంగిశెట్టి రవి, కృష్ణ, మల్లాది సురేష్, కంచేటి శ్రీహరి, షేక్.గౌస్, కోటగిరి ప్రసాద్, కృష్ణంశెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మీకోసం కార్యక్రమం

ఒంగోలు(కల్చరల్), జూన్ 22: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 10గంటల నుంచి జరుగుతుందని కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, అదేవిధంగా ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.


హత్యాచారం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

నిందితులను వదలొద్దు

● ఎంపీ కృష్ణప్రసాద్

చీరాల, జూన్ 22 : 'యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన అమానుషం. అనాగరికం. నిందితులు ఎవరినీ వదలం. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. చీరాల మండలం ఈపురుపాలెంలో శుక్రవారం యువతి పై హత్యాచార ఉదంతం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఎంపీ కృష్ణ ప్రసాద్ ఈపురుపాలెం వచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా ఉంటామని చెప్పారు. నిందితులను ఎవరిని వదిలిపెట్టమని చెప్పారు. ఘటన పూర్వాపరాలను డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఘటన జరిగిన ప్రదేశంకు పక్కనే ఉన్న బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ప్రహరీ గోడపై కొందరు అప్పుడప్పుడు కూర్చుంటారనే కోణంలో వివరాలు అడిగి తెసుకున్నారు. స్కూలు విద్యార్థినులతో మాట్లాడారు. ఎంపీ వెంట టీడీపీ నాయకులు నాతాని ఉమామహేశ్వరరావు, గుద్దంటి చంద్రమౌళి తదితరులు ఉన్నారు.


ముప్పవరంలో టీడీపీ నేత చేపట్టిన పాదయాత్రను ప్రారంభిస్తున్న గొట్టిపాటి హర్షవర్ధన్

శింగరకొండకు టీడీపీ నేత పాదయాత్ర

పంగులూరు, జూన్ 22 : మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గరిమిడి జగన్మోహనరావు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి సన్నిధికి చేపట్టిన మహా పాదయాత్రను గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ ప్రారంభించారు. గొట్టిపాటి రవికుమార్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభించగా తన మొక్కు తీర్చుకునేందుకు గరిమిడి జగన్మోహనరావు శనివారం స్థానిక మహిళలు, పార్టీ నేతలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పాదయాత్ర ప్రారంభించేందుకు హాజరయిన గొట్టిపాటి తనయుడు హర్షవర్ధన్ ముందుగా గ్రామంలోని బొడ్డురాయి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, బాలిన రామసుబ్బారావు, చింతల సహదేవుడు, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, గుర్రం ఆదిశేఖర్, అల్లంనేని బ్రహ్మనందస్వామి, బొప్పూడి నాగేశ్వరరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, జక్రయ్య, వరపర్ల సుబ్బారావు, జేకేసీ, ఇంటూరి పూర్ణయ్య, కోటయ్య, పలు గ్రామాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఏలూరి గెలుపుతో నక్కలపాలెం నుంచి పాదయాత్ర

ఇంకొల్లు,జూన్ 22: పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా మండలంలోని పెద్దనక్కలపాలెం, చిననక్కలపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆయా గ్రామల ప్రజలు పావులూరి పొలిమేర వీరాంజనేయస్వామి సన్నిధికి పాదయాత్ర చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పాదయాత్రలో మహిళలు, రైతులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా 1000 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ పాదయాత్రలో చిలుకూరి శ్రీనివాసరావు, జాగర్లమూడి రామాంజనేయులు, చిలుకూరి రంగారావు, బాచిన శ్రీకాంత్, ఏలూరి మురళీకృష్ణ, శ్రీనివాసచక్రవర్తి, పవన్, నరసింహస్వామి, వీరనారాయణ, నీలిమ, సుబ్బరావమ్మ గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో సీతా రాముల మూలవిరాట్టు విగ్రహాలు

వైభవంగా సీతారాముల కల్యాణం

మార్టూరు, జూన్ 22 : మండలంలోని తాటివారిపాలెం గ్రామంలోని రామాలయం లో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామంలోని రామాలయం 4 వ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించడానికి ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. దాంతో అర్చకులు ముప్పాళ్ల శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం మండపంలో ఉదయం యజ్ఞయాగాదులు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని 13 జంటలకు చెందిన దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాదం చేశారు. తరువాత సాయంత్రం దేవాలయంలో ఏర్పాటుచేసిన వేదికపైన సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి 15 మంది దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిలో కొంతమంది స్వామి వారి దంపతులకు నూతన వస్త్రాలను, పట్టు దుస్తులు అందజేశారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి గ్రామస్థులు భారీగా తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు.

డ్రగ్స్ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే కొండయ్య


డ్రగ్స్ రహిత సమాజం కోసం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 22 : డ్రగ్స్ రహిత సమాజం రూపకల్పనే అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య పిలుపునిచ్చారు. శనివారం సచివాలంలో ప్రిన్సిపల్ హోం సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ చాంబర్‌లో ప్రిన్సిపల్ హోం సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తాతో కలసి డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు సంబంధించి చైతన్యం కలిగించే కరపత్రాలను కొండయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలతో యువత నిర్వీర్యం అవుతుందన్నారు. ఆ మహమ్మారిని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు చైతన్యవంతంగా ఆలోచించి సహకరించాలని పిలుపునిచ్చారు.

అమాత్య పదవితో ఉప్పొంగిన అద్దంకి

మంత్రి గొట్టిపాటిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ శ్రేణులు

అద్దంకి, జూన్ 22: రాష్ట్రవిద్యుత్‌శాఖమంత్రిగా గొట్టిపాటి రవికుమార్ శనివారం మధ్యాహ్నం అమరావతిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.


విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కొండయ్య

అద్దంకి మండల నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్, చాగంటి రాజేంద్ర ప్రసాద్, పెంట్యాల రామాంజనేయులు, అడుసుమల్లి శ్రీనివాసరావు, గాలం శ్రీనివాసరావు, కోంద్రు వీరాంజనేయులు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, 19 వ వార్డు కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు, ఇక్కుర్తి కొండలు, ధర్మవరపు నాగేశ్వరరావు, దామా సురేంద్ర, అద్దంకి పట్టణ టీడీపీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నాయకులు గార్లపాటి శ్రీనివాసరావు, చిన్ని హనుమా తదితరులు అమరావతికి వెళ్లి గొట్టిపాటికి శుభాకాంక్షలు తెలిపారు. అద్దంకికి తొలిసారి మంత్రి పదవి దక్కటం, శనివారం విద్యుత్‌శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ బాధ్యతలు చేపట్టడంతో అద్దంకి నియోజకవర్గ టీడీపీ శ్రేణులలో ఆనందం ఉప్పొంగింది.

ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచుగరటయ్య, పోతుల రామారావులతో పాటు గూడూరి ఎరిక్షన్‌బాబు, దామచర్ల సత్య తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మేదరమెట్లలో..

మేదరమెట్ల : విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మేదరమెట్లలోని పాత ఒంగోలు రోడ్డులో ఎస్‌వీ కన్వెన్షన్ నందు టీడీపీ శ్రేణులు, ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు.

కాలినడకన శింగరకొండకు టీడీపీ శ్రేణులు

టీడీపీ అధికారంలోకి రావటం, ఎమ్మెల్యే గా గొట్టిపాటి రవికుమార్ ఎన్నికై మంత్రి పదవి చేపట్టడంతో గోవాడ టీడీపీ శ్రేణులు శనివారం కాలినడకన శింగరకొండకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ నేతలు పుట్టా సాంబశివరావు, మాకినేని ఏడుకొండలు, నరిశెట్టి వీరయ్య, రావిపాటి చెన్నయ్య మాదాల వెంకటేశ్వర్లు తదితరులు ఆధ్వర్యంలో సుమారు 200 మంది టీడీపీ శ్రేణులు గోవాడ నుంచి చినకొత్తపల్లి, కొత్తరెడ్డిపాలెం, శింగరకొండ పాలెం మీదుగా కాలినడకన శింగరకొండకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.


విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అద్దంకి మండల టీడీపీ నేతలు

కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే కొండయ్య వెంట పలువురు నాయకులు ఉన్నారు.

అమరావతికి తరలిన టీడీపీ నేతలు

బల్లికురవ : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రిగా అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల టీడీపీ నేతలు రాజధాని అమరావతికి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈసందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అద్దంకి నియోజకవర్గానికి మొట్టమొదటి సారిగా మంత్రి వర్గంలో చోటు కల్పించటంతో టీడీపీ శ్రేణులు ఎంతో ఉత్సాహంతో ఈకార్యక్రమానికి తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో నేతలు మలినేని గోవిందరావు, దూళిపాళ్ల రామగోవిందు, దద్దాల అంజయ్య, బెల్లంకొండ సుబ్బయ్య, పావులూరి ఏడుకొండలు, పలు గ్రామాలకు చెందిన నేతలు ఉన్నారు.


మంత్రి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బల్లికురవ మండల టీడీపీ నేతలు


రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అద్దంకి పట్టణ టీడీపీ నేతలు

గొట్టిపాటికి శుభాకాంక్షలు తెలిపిన పలువురు ఎమ్మెల్యేలు

విద్యుత్‌శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించగా ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డి,

చీరాల నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలి

- మంత్రి రవికుమార్‌తో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : విద్యుత్‌శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన గొట్టిపాటి రవికుమార్‌ను చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య శనివారం కలిశారు. మంత్రి చాంబర్‌లో రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీరాల నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కొండయ్య మంత్రి రవికుమార్‌ను


రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్యవైశ్య నేతలు

రెవెన్యూ సమస్యలపై మంత్రికి ఏలూరి వినతి

పర్చూరు, జూన్ 22: పర్చూరు నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో పలు సమస్యలకు సంబంధించిన లేఖలను మంత్రికి అందజేశారు. త్వరితగతిన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ప్రధానంగా పర్చూరు నియోజకవర్గంలోని అత్యధిక సంఖ్యలో యువతకు ఉపాధి కల్పించేందుకు, ముస్లిం సోదరులకు జీవనోపాధి పొందేలా ఆటోనగర్ ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఇంకొల్లు, మార్టూరు, పర్చూరు మండల కేంద్రాల్లో ఆటోనగర్ ఏర్పాటుకు సానుకూలంగా మంత్రి స్పందించినట్లు ఏలూరి తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాల మరమ్మతులు చేపట్టి ఆధునీకరించాని కోరారు. దశాబ్దాల క్రితం నిర్మించిన కార్యాలయాలు కావటంతో కొద్దిపాటి వర్షం పడినా ఉద్యోగులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని మంత్రికి వివరించారు. అదేవిధంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, స్థలం కేటాయించి నూతన భవనాలు నిర్మించాలని మంత్రిని ఏలూరి కోరారు. వీటిపై స్పందించిన మంత్రి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఏలూరి తెలిపారు.


సమస్యలపై మంత్రి అనగానికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

హంతకులను కఠినంగా శిక్షించాలి

- ఘటనపై మార్మోగిన నినాదాలు

చీరాలటౌన్, జూన్ 22 : చీరాల మండలం ఈపూరుపాలెం సీతారామపేటలో యువతిపై దాష్టీకానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని నినాదాలు మార్మోగాయి. ఈక్రమంలోనే ఉదయం బాధిత కుటుంబాన్ని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి పరామర్శించారు. ఈసందర్భంగా ఘటనపై ఆరా తీశారు. నేరానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, డివిజన్ కార్యదర్శి ఎన్. బాబురావు, తదితరులు ఉన్నారు.


గడియారస్తంభం కూడలిలో మానవహారం నిర్వహిస్తు విద్యార్థులు

నిందితులను కఠినంగా శిక్షించాలి ఈపూరుపాలెంలో దురాగతానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, వివిధ కళాశాలల విద్యార్థినులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ భవనం నుంచి ర్యాలీగా గడియారస్తంభంకు చేరుకున్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గంజాయి మత్తులో యువతిపై దారుణానికి పాల్పడినట్లు ఆరోపించారు. ఇలాంటి క్రూర మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు సుభాషిణి, మనోజ్‌కుమార్, కొండయ్య, జనార్దన్, లక్ష్మీ, భగవాన్‌దాస్, వెంకటేష్, రాంబాబు, వివిధ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

వలపర్లలో రెండిళ్లలో చోరీ

మార్టూరు, జూన్ 22: మండలంలోని వలపర్లగ్రామంలో రెండు ఇళ్లల్లో చోరీ జరిగినట్లు శనివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు. ఆయన కథనం ప్రకారం వలపర్ల గ్రామంలోని షేక్ మాబులా, పర్చూరి సుకన్య అనే మహిళల ఇళ్లల్లో చోరీ జరిగింది. గ్రామంలోని పక్క పక్క వీధులలో నివాసం ఉండే వారిద్దరు మహిళలు విడివిడిగా గురువారం వేరే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చిన వారిద్దరు మహిళలు ఇంటికి వెళ్లి చూడగా తలుపులు తాళం పగలగొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గ్రహించారు. వారిలో సుకన్య ఇంటిలోని బీరువా తలుపులు తెరచి అందులోని దుస్తులు, వస్తువులను చెల్లా చెదురు చేశారు. అదేవిధంగా మాబులా ఇంటిలోని 11 గ్రాముల విలువైన బంగారపు చిన్న వస్తువులు,సుకన్య ఇంటిలోని 12 గ్రాముల బంగారు వస్తువులను దొంగలు ఎత్తుకుపోయినట్లు గమనించారు. దాంతో వారిద్దరు శనివారం సాయంత్రం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


బీరువాలోని దుస్తులను చెల్లాచెదురు చేసిన దొంగలు

అనంతరం ఏఎస్ఐ బాషా హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు లు వలపర్ల గ్రామం వెళ్లి దొంగతనం జరిగిన రెండు ఇళ్లను పరిశీలించారు. ఈ కాలనీల్లోని స్థానికులను విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు.

రేపు మార్టూరులో ఉచిత మెగా వైద్యశిబిరం

పంగులూరు, జూన్ 22 : మండల కేంద్రమైన మార్టూరులో ఈ నెల 24న స్థానిక రాయల్ జూనియర్ కళాశాలలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ క్యాంప్ ఇన్‌చార్జి చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, పంగులూరు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు గుండె, చర్మ వ్యాధులు, పళ్లకు సంబంధించిన అనేక చికిత్సలు ఉచితంగా చేస్తారని తెలిపారు.

సోమవారం ఉదయం 9 గంటలకు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. గుండె సమస్యలు ఉన్న వారికి ఈసీజీ, ఈసీహెచ్‌వో పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకుని రావాలని కోరారు.

ఒడ్డుకు చేరిన మరో ఇద్దరు మృతదేహాలు


అమల్‌రాజా(ఫైల్)


నితిన్(ఫైల్)

రామాపురం(చీరాల టౌన్), జూన్ 22 : బాపట్ల జిల్లా రామాపురం తీరంలో శుక్రవారం గల్లంతయిన ఇద్దరి మృతదేహాలు శనివారం ఉదయం సమీపంలోనే ఒడ్డుకు చేరాయి. ఏలూరు జిల్లా పెద్దవేగి మండలం దుగ్గిరాల గ్రామానికి చెందిన జాలా కిషోర్(26), గొటుకుల తేజ(19), కోరు అమల్‌రాజు(19), చెట్టుమాల నితిన్(19), గౌతమ్, సాగర్, బుచికి, మోహన్, తేజ, సునీల్, రామరాజు, మురళి స్నేహితులు. వీరంతా రామాపురం సముద్రంలో మునిగేందుకు వ్యాన్‌లో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో వచ్చారు. అరగంట పాటు భోజనం చేశారు. 2:30నిమిషాలకు సముద్రంలో దిగి 5 నిముషాలు మాత్రమే మునిగారు. అప్పటి వరకు కనీసం వీరి తలలు కూడా తడవలేదు. ఇంతలో ఒక్కసారిగా కెరటాలు తాకిడికి అంతా లోనికి కొట్టుకుపోయారు. అదృష్టవశాత్తు ఏడుగురు బయటకు రాగా కిషోర్, గొటుకుల తేజ, నితిన్, అమల్‌రాజా లోనికి కొట్టుకుపోయారు. దీంతో సహచరులు బిగ్గరగా కేకలు వేయగా మెరైన్, రూరల్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే కొద్దిసేపటికే గొటుకుల తేజ, జాలా కిషోర్ మృతదేహాలు ఒడ్డుకు రాగా, నితిన్, అమల్‌రాజా జాడకోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఎట్టకేలకు సమీపంలోనే శనివారం ఉదయం మిగిలిన ఇద్దరి మృతదేహాలు ఒడ్డుకు చేరాయి. దీంతో కేసు నమోదుచేసుకున్న ఈపూరుపాలెం పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే అమల్ రాజా తండ్రి గతంలోనే మృతిచెందగా, తాత గతేడాది ఇదేరోజు మృతిచెందాడు. సోదరి, తల్లికి అండగా ఉన్న అమల్‌రాజా కూడా మృతిచెందడంతో ఆకుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

హోంమంత్రి పర్యటన అనంతరం తీరంలో జాగ్రత్తలు

చీరాలకు శుక్రవారం వచ్చిన రాష్ట్ర హోంమంత్రి అనిత ఈ విషయంపై ఆరా తీశారు. పోలీసులకు తగు జాగ్రత్తలు సూచించారు. దీంతో వారు సముద్రతీరంలో హెచ్చరిక బోర్డులు, డేంజర్ జోన్‌లలో బ్యానర్‌లు ఏర్పాటు చేశారు. అలాగే నిత్యం పోలీస్ పికెట్ ఉంటుందని ప్రకటించారు.

ఆంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, జూన్22: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం నిర్వహించారు. అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. లక్ష తమలపాకులతో 11 ఆవృత్తములు గా వేదపండితులు, అర్చకులు పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

అద్దంకిటౌన్, జూన్ 22: ఏపీ గురుకుల పాఠశాల ఎంట్రెన్స్ పరీక్షలలో ప్రతిభ చూపి సీట్లు సాధించిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. మండలంలోని రాళ్ళపల్లి ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ సమావేశం జరిగింది. విద్యార్థులు ప్రభుత్వం అందించే వసతులతో సక్రమంగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్. హనుమంతరావు మరో ఇద్దరికి ద్వితీయ, తృతీయ బహుమతిలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఉప ముఖ్యమంత్రిని కలిసిన విజయ్‌కుమార్

పర్చూరు, జూన్ 22: ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌ను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ సమన్వయ కర్త పెద్దపూడి విజయ్ కుమార్ శనివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిశారు. జనసేన పార్టీ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద పార్టీగా నిలిచిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపి పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రంగాల్లో రాష్ట్రం ఉన్నతంగా అభివృద్ధి చెందేలా పరిపాలించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేసిన జనసైనికులను పవన్ కల్యాణ్ అభినందించినట్లు విజయ్ కుమార్ తెలిపారు.


పవన్‌ను అభినందిస్తున్న విజయ్‌కుమార్

పాఠశాలకు దాతల సహకారం అభినందనీయం


కంప్యూటర్‌ను అందజేస్తున్న దాతలు

ఇంకొల్లు,జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయసహకారాలు అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి అనంతు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నాగండ్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన సోమేపల్లి భాస్కరరావు, ప్రమీలా దంపతులు పాఠశాలకు సుమారు 40వేల రూపాయల విలువ కలిగిన కంప్యూటర్‌ను అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామదాసు మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత చదువులలో ముందుకు సాగాలని కోరారు. అనంతరం దాతలు భాస్కరరావు,ప్రమీలా దంపతులను అభినందించారు.

నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలు

● ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి



రామాపురం తీరంలో పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

వేటపాలెం(చీరాల), జూన్ 22 : తీర ప్రాంతంలో నిర్మాణాలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి చెప్పారు. వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం తదితర ప్రాంతాల్లో సీఆర్‌జెడ్(కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్) నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోందని జర్నలిస్ట్ నాగార్జునరెడ్డి, మరి కొందరు చేసిన ఫిర్యాదుల మేరకు శనివారం పలుశాఖల అధికారులతో కలసి ఆర్డీవో తీరప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు అందజేసి తగిన చర్యలు చేపడామన్నారు. తీరంలో ఎవరు కూడా సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించరాదన్నారు. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సముద్రంలో అపశ్రుతులు బాధాకరం

చీరాల, జూన్ 22 : వేటపాలెం మండలం రామాపురం తీరంలో శుక్రవారం సముద్రంలో గల్లంతైన నలుగురు యువకులు విగతజీవులుగా శనివారం ఒడ్డుకు చేరారు. మృతదేహాలను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఏరియా వైద్యశాల మార్చురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. సంఘటన పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేటపాలెం మండలం రామాపురం తీరం వద్ద దుర్ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. ప్రమాదాలకు కారణాలపై ఆరా తీశారు. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బలరాం వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అధికారమే అండగా వేల కోట్ల రూపాయల ప్రజా సంపదను కొల్లగొట్టినట్లు తేలిపోయింది. దీనివెనుక అక్రమార్కులెవరో కూడా గుర్తించారు. మైనింగ్ శాఖ తన పరిధి మేరకు జరిమానాలు కూడా విధించింది. కానీ ప్రభుత్వ భూములను కుళ్లబొడిచి ప్రకృతిని నాశనం చేసిన దోపిడీదారులపై చర్యలకు మాత్రం రెవెన్యూ శాఖ వెనకాడుతోంది. ప్రభుత్వ భూమిలో అనుమతుల్లేకుండా మట్టి ఎత్తితేనే కేసులు పెట్టే రెవెన్యూ అధికారులు ఇప్పుడు రూ.వందల కోట్ల విలువైన క్వార్ట్జ్ వంటి ఖనిజాన్ని తవ్వి తరలించుకుపోతే మౌనంగా ఉండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కుళ్లబొడిస్తే కునుకు తీస్తారేం!?

- బట్టబయలైన క్వార్ట్జ్ దోపిడీ
- ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారం తవ్వకాలు
- రూ.వేల కోట్ల ప్రజల సంపద స్వాహా
- క్రిమినల్ కేసులు పెట్టని రెవెన్యూ శాఖ
- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : తెల్లరాయి (క్వార్ట్జ్) రూపంలో వైసీపీ నేతలు సాగించిన దోపిడీ అంతా ఇంతా కాదు. వైసీపీ ప్రభుత్వం చివరి సంవత్సరంలో క్వార్ట్జ్‌కు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఏర్పడటంతో గద్దల్లా వాలిపోయారు. అది ప్రభుత్వ భూమినా.. పట్టా భూమినా.. అన్న సంబంధం లేకుండా సైదాపురం, పొదలకూరు, రాపూరు, చేజర్ల మండలాల్లో ఇష్టానుసారం తవ్వేశారు. ఈ ఖనిజాన్ని అక్రమ మార్గంలో దేశం దాటించి రూ.వేల కోట్లు గడించారు. నాడు ఈ దోపిడీ జోలికి వెళ్లేందుకు భయపడిన మైనింగ్ అధికారులు ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే రంగంలోకి దిగారు. తవ్విన చోటల్లా కొలతలు తీసి ఏ స్థాయిలో క్వార్ట్జ్‌ను తరలించారో నిర్ధారించారు. వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాదిలోనే దాదాపు 4 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా క్వార్ట్జ్‌ను తవ్వి తరలించినట్లు నిర్ధారించారు. అంతకముందు కూడా జరిగిన తవ్వకాలను నిగ్గు తేల్చి మొత్తంగా రూ.255 కోట్ల పెనాల్టీ విధించారు. ఈ మేరకు ఎక్కడికక్కడ మైనింగ్ అధికారులు పంచనామా నిర్వహించి అక్రమంగా తవ్వకాలు జరిపిన వారికి పెనాల్టీ నోటీసులు జారీ చేసింది. మరో లక్ష మెట్రిక్ టన్నులకుపైగా క్వార్ట్జ్‌ను తరలించేందుకు సిద్ధంగా ఉంచగా దానిని కూడా మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. మొత్తంగా క్వార్ట్జ్ అక్రమాలకు సంబంధించి మైనింగ్ శాఖ తన పరిధిలో 275 కేసులను బుక్ చేసింది. మైనింగ్ చట్టాల ప్రకారం పెనాల్టీ వసూళ్ల ప్రక్రియ జరుగుతోంది. ఇక్కడివరకూ బాగానే ఉంది.

స్పందించని రెవెన్యూ శాఖ

అయితే ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా తవ్వేస్తే రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. ఈ తవ్వకాల మూలంగా ప్రజాధనం దోపిడీ జరగడమే కాకుండా పర్యావరణపరంగా కూడా తీవ్ర సమస్యలు తలెత్తుతాయి. ఈ అక్రమ తవ్వకాలు జరిపింది ఎవరన్నది మైనింగ్ అధికారుల విచారణలో తేటతెల్లమైంది. వీరిలో మెజారిటీ వ్యక్తులు వైసీపీకి చెందిన వారే ఉన్నట్లు తెలుస్తోంది. కానీ ఇంతవరకూ రెవెన్యూ శాఖ ఒక్క పోలీసు కేసు కూడా పెట్టక పోవడం గమనార్హం. అప్పటి ఎమ్మెల్యేల ఒత్తిడితో తహసీల్దార్లు, జిల్లా ఉన్నతాధికారులు కూడా అక్రమ తవ్వకాలను చూసీచూడనట్లు వదిలేశారు. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో అక్రమ క్వార్ట్జ్ మైనింగ్ దోపిడీ బట్టబయలైంది. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ భూముల్లో అను మతుల్లేకుండా విలువైన ఖనిజాన్ని తరలించడంపై రెవెన్యూ శాఖ క్రిమినల్ కేసులు పెట్టాల్సి ఉంది. ఇది జరిగితేనే క్వార్ట్జ్ అక్రమాల వెనుక అసలు దొంగలు ఎవరన్నది బయటపడు తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అప్పుడే అక్రమార్కుల్లో వణుకు మొదలవుతుందని, భవిష్యత్‌లో మరొకరు ఈవిధంగా చేసేందుకు భయపడుతారన్న చర్చ జరుగుతోంది. రూ.వేల కోట్లు దోచుకున్న అక్రమార్కులకు రూ.వందల కోట్లు పెనాల్టీలు చెల్లించడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ వారు చేసిన తప్పులకు శిక్ష ఏమిటన్నదే ఇక్కడ అసలు ప్రశ్నగా మారింది.

చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం

అనుమతుల్లేకుండా క్వార్ట్జ్ తవ్వకాలు జరప డంపై విచారణ జరిపి రూ.255 కోట్ల పెనాల్టీలు విధించాం. ప్రభుత్వ భూముల్లో జరిగిన తవ్వకాల వివరాలను తెలుసుకుంటాం. తదుపరి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- ఎం హరినారాయణన్, కలెక్టర్



వేమిరెడ్డి దంపతులతో భేటీ అయిన మంత్రులు, ఎమ్మెల్యేలు

'క్వార్ట్జ్' అక్రమాలపై సీబీఐతో విచారణ

- వీపీఆర్ నివాసంలో మంత్రులు, ఎమ్మెల్యేల తీర్మానం

నెల్లూరు (హరనాథపురం), జూన్ 22 : జిల్లాలో జరిగిన క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని ఉమ్మడి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు తీర్మానించారు. అలాగే, ఉమ్మడి జిల్లా అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేద్దామని నిర్ణయించుకున్నారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు శనివారం తాడేపల్లిలోని తమ నివాసంలో భేటీ అయ్యారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డితోపాటు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరావు తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారు చర్చించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లాలనే అంశాలపైనా వారు చర్చించారు.

నల్లబజారుకు నాడు-నేడు సామగ్రి

- ఓ హెచ్‌ఎం నిర్వాకం
- అడ్డుకున్న గ్రామస్థులు

సంగం, జూన్ 22: పాఠశాలలో నాడు-నేడు పనులు చేయగా మిగిలిన సామగ్రిని నల్లబజారుకు తరలిస్తున్న ప్రధానోపాధ్యాయుడి నిర్వాకాన్ని గ్రామస్థులు అడ్డుకున్న సంఘటన శనివారం సంగం మండలంలోని అనసూయనగర్‌లో జరిగింది. నాడు-నేడు పథకంలో మొదటి విడత కింద పాఠశాలలో రెండు అదనపు గదుల నిర్మాణానికి రూ.24 లక్షలు, మౌలిక వసతుల కల్పనకు కింద మరో రూ.5 లక్షలు మంజూరయ్యాయి. పనులు కూడా పూర్తయ్యాయి. అయితే, మిగిలిపోయిన టైల్స్ ఇతర సామగ్రిని శనివారం ప్రధానోపాధ్యాయుడు ట్రాక్టర్‌కు లోడ్ చేస్తుండగా, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు నిలదీశారు. దీంతో ఆయన ఎంఈవో పంపించమన్నారని చెప్పారు. గ్రామస్థులు ఎంఈవో జానికీరామ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన హెచ్‌ఎంను ప్రశ్నించగా ఏవేవో చెప్పి బుకాయించారు. దీంతో హెచ్‌ంకు షోకాజ్ నోటీస్ అందచేశారు. హెచ్‌ఎం నిర్వాకంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని ఎంఈవో తెలిపారు.



ట్రాక్టర్‌కు టైల్స్‌ను లోడ్ చేస్తున్న కూలీలు

- ఏటా వైద్య శాఖ లక్ష్యం వెయ్యి.. చేసింది మాత్రం 11 మందికే..!
- అపోహలు వీడాలంటున్న వైద్యులు
- కొరవడిన కుటుంబ నియంత్రణ ప్రచారం

"వేసక్టమా... నాకు వద్దేలే బా. ఉద్యోగం చేసేటోడ్ని. అలసట ఉంటుంది. లేనిపోని ఆరోగ్య సమస్యలు వస్తాయి. నాకెందుకు!?" ఇదండీ మగవారి వరస. కుటుంబ నియంత్రణలో (కు.ని) భాగంగా వేసక్టమి ఆపరేషన్ చేయించుకునే మగవారి సంఖ్య జిల్లాలో చాలా తక్కువగా ఉంది. ఈ ఆపరేషన్ చేయించుకుంటే మగతనం తగ్గుతుందన్న అపోహ చాలామందిలో ఉంది. ఈ అపోహలు వీడాలని వైద్యులు చెబుతున్నా ససేమీరా అంటున్నారు. కు.ని అంటే అది కేవలం మహిళలకు మాత్రమే అన్న భావన అన్ని వర్గాల్లోనూ పాతుకుపోయింది. ఏటా వైద్య ఆరోగ్య శాఖ వేసక్టమి ఆపరేషన్లు చేయాలని వెయ్యిలోపు లక్ష్యాలను నిర్దేశిస్తున్నా కేవలం 11 మంది మాత్రమే వేసక్టమి చేశారు. దీంతో లక్ష్యాలు చేరుకోవడం లేదు.

- నెల్లూరు (వైద్యం)



జనాభా నియంత్రణ లేక పోవటం వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులతోపాటు ప్రభుత్వాలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 1952లో జనాభా నియంత్రణకు శ్రీకారం చుట్టింది. అయితే నాలుగేళ్లగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కు.ని లక్ష్యాలపై పెద్దగా దృష్టి సారించలేదు. జిల్లాలో 15వేల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలని కేంద్రం లక్ష్యాన్ని నిర్ణయించగా, ఇందులో 50 శాతం కూడా పూర్తి కాలేదు.

జనాభాకు అనుగుణంగా లక్ష్యాలేవి?

జిల్లాలో జనాభాకు అనుగుణంగా కుటుంబ నియంత్రణ లక్ష్యాలు సాధించటంలో వైద్య ఆరోగ్యశాఖ విఫలమవుతో ంది. ప్రస్తుతం జిల్లాలో 26.50 లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రతి ఏటా జిల్లా జనాభా పెరుగుతూనే ఉంది. ప్రతి ఏటా 45వేల ప్రసవాలు జరుగుతుండగా, ఇందులో 30వేలమంది ప్రసవాలు జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులలోనే జరుగుతున్నాయి. మిగిలినవి ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్నాయి. ఈ క్రమంలో మహిళలకు నిర్వహించే ట్యూబెక్టమి శస్త్రచికిత్సలు తప్ప, మగవారికి నిర్వహించే వేసక్టమి చికిత్సలు జరగడం లేదు. గత ఏడాది 737 వేసక్టమి శస్త్రచికిత్సలు చేయాలని లక్ష్యాన్ని నిర్ధేశించగా, కేవలం ఇప్పటి వరకు 11 మందికి మాత్రమే జరిగాయి.

తగిన ప్రచారం ఏది..?

జనాభా నియంత్రణపై దృష్టి పెట్టాల్సిన వైద్య ఆరోగ్యశాఖ వేసక్టమి పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వేసక్టమి పట్ల మగవారిలో నెలకొన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేయటంలో తగిన ప్రచారం చేపట్టడం లేదు. పట్టణాలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలలోనే కుటుంబ నియంత్రణలపై విస్తృత ప్రచారం చేయాల్సి ఉన్నా ఆదిశగా చర్యలు చేపట్టడం లేదు. జనాభా నియంత్రణ లక్ష్యాలు నెరవేరక పోతే భవిష్యత్తులో ప్రభుత్వాలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇద్దరు పిల్లలు పుట్టగానే కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించుకోవాలని ప్రజల్లో తగిన అవగాహన ఉన్నా, ఎక్కువగా ఆడవారే ట్యూబెక్టమి ఆపరేషన్లు చేయించుకుంటున్నారేకానీ మగవారు వేసక్టమి ఆపరేషన్లు మాత్రం చేయించుకోవడం లేదు.

జిల్లాలో కు.ని శస్త్రచికిత్సలు

సంవత్సరం	వేసక్టమి	ట్యూబెక్టమి
2019 - 20	11	9769
2020 - 21	0	5662
2021 - 22	0	5305
2022 - 23	10	6181
2023 - 24	11	6857

విస్తృతంగా ప్రచారం చేపడుతాం..

వేసక్టమిపై విస్తృత ప్రచారం చేపడుతాం. గ్రామస్థాయిలో ఈ శస్త్రచికిత్సలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. మగతనం తగ్గుతుందని, కొన్ని రోజులు ఇంట్లోనే ఉండాల్సి వస్తుందన్న అపోహలు మగవారిలో ఇంకా ఉన్నాయి. వారిలో ఉన్న అపోహలు తొలగిస్తాం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక

నెల్లూరు (హరనాథపురం) : ప్రతి సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులంతా తమ పరిధిలోని అర్జీలను మీకోసం వెబ్‌సైట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాయగూరల ధరలు స్థిరీకరించండి!

- అవసరమైతే పొరుగు జిల్లాల నుంచి తెప్పించండి
- అక్రమ నిల్వలపై సోదాలు చేయండి: జేసీ

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో ఉల్లిపాయలు, టమోటా ధరలు పెరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జరిగిన జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జేసీ మాట్లాడారు. ఎండ వేడిమి ప్రభావంతో ఉల్లిపాయలు, టమోటాలతోపాటు ఇతర కూరగాయల దిగుబడులు గణనీయంగా తగ్గాయని, దీంతో ధరలు పెరిగినట్లు చెప్పారు. ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే పొరుగు జిల్లాల నుంచి కాయగూరలను సేకరించి రైతుబజార్లలో విక్రయించేలా చూడాలని ఆదేశించారు. మార్కెటింగ్, పౌరసరఫరాలు, తూనికల కొలతలు, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులతో ఏర్పాటైన విజిలెన్స్ కమిటీ ద్వారా వ్యాపారుల దుకాణాలు, గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎవరైనా అవసరానికి మించి ఎక్కువ స్టాకు నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ అనితకుమారి, వ్యవసాయాధికారి సత్యవాణి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, డీఎస్వో వెంకటరమణ, తూనికల కొలతల శాఖ డీసీ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

నేటినుంచి వెంగమాంబ బ్రహ్మోత్సవాలు



దుత్తలూరు (ఉదయగిరి రూరల్) : జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలోని వెంగమాంబ పేరంటాల అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. సుదూర ప్రాంతాల నసుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలకమండలి, అధికారులు సర్వంసిద్ధం చేశారు. అంకురార్పణతో ప్రారంభమయ్యే ఉత్స వాలకు వెంగమాంబ వంశస్థులైన పచ్చవ కుటుంబ సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకొస్తారు. నియమనిష్టలతో మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. వెంగమాంబ దేవర ఇంట్లో జరిగే పూజా కార్యక్రమాలకు భక్తులు భారీగా పాల్గొంటారు. అలాగే వెంగమాంబ స్వగ్రామం వడ్డిపాళెం పచ్చవ దేవర ఇంట్లో పసుపు దంచే కార్యక్రమం కనులపండువగా నిర్వహించనున్నారు. పసుపు దంచేందుకు మహిళలు పోటీ పడతారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వలస వెళ్లిన వారు కుటుంబాలతో సహా గ్రామాలకు చేరుకొంటుండటంతో సందడి నెలకొంది. వెంగమాంబ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భారీ ఎత్తున పేరంటాలు, వివిధ దేవతామూర్తుల ప్రభలను ఏర్పాటు చేశారు.

45 ప్రత్యేక బస్సులు

నెల్లూరు (క్రైం) : వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు 45 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ప్రజారవాణా జిల్లా అధికారి పీవీ శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్లతోపాటు ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు బస్టాండ్ల నుంచి ఈ బస్సులు నడుస్తాయని, రద్దీ పెరిగితే బస్సుల సంఖ్య పెంచుతామని పేర్కొన్నారు.

కల్యాణ వైభోగమే!

భక్తజనంతో కిక్కిరిసిన గంగపట్నం



కల్యాణ వేదికపై త్రిశూలేశ్వరస్వామి, చాముండేశ్వరిదేవి ఉత్సవర్లు

ఇందుకూరుపేట, జూన్ 22 : వేదపండితుల మంత్రోచ్ఛరణ.. మంగళ వాయిద్యాలు.. అతిథులుగా తరలివచ్చిన భక్త జనం నడుమ గంగపట్నంలోని త్రిశూలేశ్వర స్వామి, చాముండేశ్వరి దేవిల కల్యాణం శనివారం తెల్లవారుజామున అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణం అనంతరం ఉత్సవర్లను పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఈవో బండి శాంతయ్య, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎంలో 18 మంది స్పెషలిస్ట్ వైద్యుల తొలగింపునకు శ్రీకారం

నెల్లూరు (వైద్యం), జూన్ 22 : వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో విధులకు డుమ్మా కొడుతున్న 18 మంది కాంట్రాక్టు స్పెషలిస్ట్ వైద్యులను తొలగించనున్నారు. జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ వంటి స్పెషలిస్ట్ వైద్యులు, ఇతర వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. వీరిలో చాలామంది ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పని చేస్తున్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోజుకు రెండు గంటలు రోగులకు వైద్యసేవలు అందించాల్సి ఉంది. అయితే వీరంతా ప్రైవేట్ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో హాజరు వేసి వెళుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై మూడు నెలల క్రితమే పూర్తిస్థాయి పరిశీలన చేసిన జిల్లా అధికారులు అప్పటి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా వైద్యులను విధులను నుంచి తొలగించాలని తాజాగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు రెండు రోజుల క్రితమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరాయి. ఈ విషయమై డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యను వివరణ కోరగా విధులకు సక్రమంగా హాజరు కాని ఎన్‌హెచ్‌ఎంలో 18 మంది కాంట్రాక్టు వైద్యులను ఈ నెలాఖరుకు విధుల నుంచి తొలగిస్తున్నామని నిర్ధారించారు.

కూటమి విజయంపై మాలకొండకు పాదయాత్ర

వలేటివారిపాలెం/ లింగసముద్రం, జూన్ 22 : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా లింగసముద్రం మండలం తిమ్మారెడ్డిపాలెంకి చెందిన టీడీపీ నేతలు కార్యకర్తలు శనివారం వలేటివారిపాలెం మండలం మాలకొండకు పాదయాత్రగా తరలివచ్చారు. నృసింహస్వామికి కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్, ఇంటూరి నాగేశ్వరరావు అత్యధిక మెజారిటీతో గెలిస్తే మాలకొండకు పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నేతలు రామన మాల్యాద్రి, కే మధు, జీ వెంకటేశ్వర్లు, కే మాల్యాద్రి, పీ మాల్యాద్రి, పీ వెంకటకొండయ్య, జీ రమణయ్య, కే మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.





మాలకొండకు పాదయాత్రగా వచ్చిన టీడీపీ నేతలు, కార్యకర్తలు

మాలకొండ ఆదాయం రూ.11,40,170

వలేటివారిపాలెం, జూన్ 22 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం రూ. 11,40,170 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 7 వేలు, కుంకుమార్చన ద్వారా రూ. 30,520, వివాహాల ద్వారా రూ. 1,000, తలనీలాల ద్వారా రూ. 57,750, వాహనపూజల ద్వారా రూ. 6450, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 3,61,100, స్థల పురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 1140, రూముఅద్దెల ద్వారా రూ. 30,120, కవర్ల ద్వారా రూ. 6,900, లడ్డూప్రసాదం ద్వారా రూ. 2,15,735, అన్నదానం ద్వారా రూ. 4,17,425, విరాళాల ద్వారా రూ. 5 వేలు ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

మంత్రి గొట్టిపాటిని కలిసిన ఇంటూరి

కందుకూరు, జూన్ 22: రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. గొట్టిపాటి మంత్రిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన చాంబర్‌లో కలిసి శాలువా పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

పందలపాడులో ఆత్మగౌరవ కవాతు

కందుకూరు : ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జూలై 7న వరంగల్‌లో హలో మాదిగ చలో వరంగల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం మండలంలోని పందలపాడులో మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహించారు. మాదిగ యువకులు, విద్యార్థులు, మహిళలు అధికసంఖ్యలో ఈ కవాతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు మాట్లాడుతూ చలో వరంగల్ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు.







కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

శివ..శివా.. ఏమిటీ అన్యాయం?

- నీ ఆస్తులకే రక్షణ లేదా..!?
- మాన్యం భూముల అన్యాక్రాంతం
- పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు

వలేటివారిపాలెం, జూన్ 22 : మనకు కష్టం వస్తే దేవుడికి చెప్పుకుంటాం.. కానీ ఆ దేవుడికే కష్టమొస్తే ఎవరికి చెప్పుకోవాలి...?. వలేటివారిపాలెంలోని రామలింగేశ్వరుడి ఆలయ భూములు అన్యాక్రాంతమైనా ఎవరూ పట్టించుకోలేదు.దీంతో శివ.. శివా... నీ భూముల్ని నీవే రక్షించుకోవాలని మండల ప్రజలు ప్రార్థిస్తున్నారు. ఆలయ మాన్యం భూములు రికార్డుల్లో తప్ప ఏయే గ్రామాల్లో ఎవరెవరి ఆధీనంలో ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఆలయానికి ఉన్న రూ. కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నా దేవదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

● 170 ఎకరాల అన్యాక్రాంతం

ఈ ఆలయానికి పలు గ్రామాల్లో సుమారు 260.62 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. వాటిలో జమీన్‌ఉప్పలపాడులోని 71 ఎకరాలు, పోలినేనిపాలెంలోని 14ఎకరాలు, రామచంద్రాపురంలోని ఆరు ఎకరాలకు మాత్రమే అధికారులు ప్రతి మూడేళ్లకొకసారి బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో ఉన్న సుమారు 170 ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. ఆ భూములు ఎవరెవరి ఆధీనంలో ఉన్నాయో కూడ అధికారులకు తెలియదు. అక్రమార్కులు మాన్యం భూములను ఆక్రమించి, పంటలు సాగుచేసుకొని రూ. లక్షలు గడిస్తూ రామలింగేశ్వరుడికి శఠగోపం పెడుతున్నారు.

● ఏయే గ్రామంలో ఎన్నెన్ని ఎకరాలు

వలేటివారిపాలెంలోని రామలింగేశ్వరుడికి జమీన్‌ఉప్పలపాడులోని 185 సర్వేనెంబరులో 56.20 ఎకరాలు, 186 సర్వేనెంబరులో 14.20, 81-17 సర్వేనెంబరులో 88 సెంట్లు, పోలినేనిపాలెంలోని 57-1,2,3 సర్వేనెంబర్లలో 14.18 ఎకరాలు, అంకభూపాలపురంలోని 148 సర్వేనెంబరులో 8 ఎకరాలు, కాకర్లపాలెంలోని 307 సర్వేనెంబరులో 2.42, ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం మాలపాడులోని 197.2 సర్వేనెంబరులో 14.70, చౌటపాలెంలోని 295-1 సర్వేనెంబరులో 1.10, 295-2 సర్వేనెంబరులో 3.98, 296-1లో 8.80, 297-1లో 97 సెంట్లు, 297-3లో 1.69, బంగారక్కపాలెంలోని 119-12 సర్వేనెంబరులో 98 సెంట్లు, లింగంగుంటలోని 298 సర్వేనెంబరులో 6.68, గొల్లపాలెంలో ని 132-2 సర్వేనెంబరులో 6.20, చుండిలోని 78-1 సర్వేనెంబరులో 3.20, 157-3లో 78 సెంట్లు, 314-1 సర్వేనెంబరులో 80 సెంట్లు, వలేటివారిపాలెంలోని 348 సర్వేనెబరులో 21 ఎకరాలు, 74-1లో ఎ 2.48, 80 సర్వేనెంబరులో ఎ 5-17, 214 సర్వేనెంబరులో 12.96, 113-1 సర్వేనెంబరులో 10 సెంట్లు, 172లో 6.40, 213 సర్వేనెంబరులో 3.56, 218-1లో 26 సెంట్లు, 251-2 సర్వేనెంబరులో 6.66, 91-3 సర్వేనెంబరులో 5.27, 333 సర్వేనెంబరులో ఎ 26.90, 416 సర్వేనెంబరులో 6.90, 419-2 సర్వేనెంబరులో 6.72, 127-4 సర్వేనెంబరులో ఎ 1.50, 127-3 సర్వేనెంబరులో 92 సెంట్లు 130 సర్వేనెంబరులో 13.74, రామచంద్రాపురంలోని 108-3 సర్వేనెంబరులో 3.96, 108-9 సర్వేనెంబరులో 2.04, 52-7 సర్వేనెంబరులో 0.32 ఎకరాల మాన్యం భూములు ఉన్నట్లు ఆలయ ఈవో వంశీ తెలిపారు. ఈ భూములు ఎవరెవరి ఆధీనంలో ఉన్నాయో కూడా తెలియదు. దీంతో ఆలయ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా దేవదాయశాఖ అధికారులు స్పందించి మాన్యం భూములు ఎవరెవరి ఆక్రమణలో ఉన్నాయో గుర్తించి స్వాధీనం చేసుకోవాల్సి ఉంది.



వలేటివారిపాలెంలోని రామలింగేశ్వరుడి ఆలయం

భూములు గుర్తించి..వేలం నిర్వహిస్తాం..!

వివిధ గ్రామాల్లో ఉన్న ఆలయ మాన్యం భూములను గుర్తించి, కౌలు వేలం పాటలు నిర్వహిస్తాం. కౌలుతో వచ్చే ఆదాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. **- వంశీ, ఆలయ ఈవో**

టన్ను రూ.లక్ష పలికిన మామిడి

● చివరి దశలో ఆశాజనకంగా ధర ● కడవరకు కాపు రక్షించుకున్న రైతులకు ఊరట

ఉలవపాడు, జూన్ 22 : కాపు తక్కువైనా.. రేట్లు ఆశించిన స్థాయిలో పలకపోయినా.. చివరి వరకు కాపును సంరక్షించుకుంటూ వచ్చిన మామిడి రైతులకు ఊరట లభించిందని చెప్పొచ్చు. మండలంతోపాటు చుట్టు పక్కల మండలాలలో 80 శాతం మామిడి అమ్మకాలు పూర్తయ్యాయి. అడపాదడపా కాపుకి, వెనకచిక్కి ఏర్పడ్డ కాపునకు ఆశించి రేట్లు పలుకుతున్నాయి. కిలోకి రెండు నుంచి మూడు కాయలు తూగేంత సైజు కాయలకు ఒక టన్ను రూ. 80 వేల వరకు పలుకుతుంది. కవర్లు కట్టి ఎలాంటి మంగు, మచ్చలు లేకుండా ఉన్న మామిడి ధర టన్ను రూ. లక్ష పలుకుతుంది. సకాలంలో పూత పడక, పడిన పూత నిలవక, త్రిప్స్ వైరస్ భారీ నుంచి కాపాడుకోడానికి కౌలు రేటుతో సమానంగా పురుగు మందుల ఖర్చులు ఈ ఏడాది మామిడి రైతులను కుదేలు చేసిన విషయం తెలిసిందే. అయితే సాగు తొలిదశ నుంచి పిందెలకు కవర్లు కట్టి సాగు చేసిన రైతులకు మంచి ధర అందుబాటులోకి వచ్చింది.



ఎగుమతి కోసం ట్రేలలో సర్దుతున్న కవర్లు కట్టిన మామిడి కాయలు

● బెంగళూరు కాయలకు పడిపోయిన ధర

నష్టపోతున్న రైతును కడతేల్చినా, లేదా లాభాలు చవిచూసేలా చేసినా అది చివరి దశలోని బెంగళూరు మామాడికే దక్కుతుంది. సీజన్ చివరి వరకు చెట్లకు వేలాడుతూ సరైన సమయంలో రైతులను ఆదుకుంటాయి. ప్రతి ఏడాది ఈపాటికి టన్ను సుమారు రూ. 40 వేలు పైనే ధర పలుకుతుంది. చిత్తూరు జిల్లాలోని జ్యూస్ ఫ్యాక్టరీలకు ఇక్కడి నుంచే వేల టన్నుల మామిడి ఎగుమతి అవుతు రూ. కోట్లలో బిజినెస్ జరుగుతుంది. అలాంటిది ఇప్పుడు టన్ను రూ. 27 వేలు వరకే పలుకుతున్నందున రైతులకు నిరాశ మిగిలింది. జ్యూస్ ఫ్యాక్టరీలు యథా విధంగా ప్రతిఏటా ఏవిధమైన రేటు ప్రకారం కొనుగోలు చేస్తాయో అదే రేటు ప్రకటించినప్పటికి లోకల్ దళారులు సిండికేట్‌గా మారిరేటు మామిడికాయల రేటు పెరగకుండా చేశారనేది కొంతమంది రైతులు ఆరోపిస్తున్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలని వినతి

కావలి,జూన్ 22: పట్టణంలోని అమృత్ పథకం పైలాన్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ. భరత్‌కుమార్ కోరారు. శనివారం ఆయన స్థానిక బీజేపీ నేతలతో కలిసి డీఎస్పీ ఎం. వెంకటరమణకు వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ ఆయన పైలాన్ ధ్వంసం విషయమై సాక్షి విలేకరి కే. శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, అప్పటి డీఎస్పీ డీ. ప్రసాద్, మున్సిపల్ అధికారులను విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. పైలాన్ ధ్వంసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోకపోతే పోరాటానికి సిద్ధమని ఆయన పేర్కొన్నారు.



